PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 354 | విజయవాడ, శనివారం 26 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 26 July 2025 | Rs

బ్రిటన్‌తో ఒప్పందం.. ప్రజారోగ్యానికి దెబ్బ

- అధిక కొవ్వు, చక్కెర ఉత్పత్తులపై సుంకాలు రద్దు

3



రూట్ సెంచరీ

- ఇంగ్లండ్ 544/7

8

2026 తరువాతే...!

నియోజకవర్గాల పునర్విభజనపై సుప్రీం

ఆ తరువాత జరిగే మొదటి జనగణనప్రకారం చేయాలని వ్యాఖ్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియను సత్వరమే ప్రారంభించేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు 2022లో ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేస్తూ శుక్రవారం తుది తీర్పును వెలువరించింది. ఈ రిట్ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసిన ధర్మాసనం ఏప్రిల్ 30న తీర్పును రిజర్వు చేసింది. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం డిలిమిటేషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించి కొత్తగా రూపొందించిన జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలోనే అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేయడం అసమంజసమని పిటిషనర్లు తెలిపారు. దీనిపై విచారించిన ధర్మాసనం తాజాగా వెలువరించిన తీర్పులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3) ప్రకారం రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై పరిమితులు ఉండే అవకాశముందని పేర్కొంది. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26కి కూడా పరిమితి ఉందని పేర్కొంది. ఆర్టికల్ 170కి లోబడే ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 26 ఉందని, దీని ప్రకారం 2026 తరువాత మొదటి జన గణన నిర్వహించిన తరువాత మాత్రమే డిలిమిటేషన్ నిర్వహించవచ్చని పేర్కొంది. జమ్మూకాశ్మీర్‌లోని నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ రాజ్యాంగ పరిధిలోనే జరిగిందని ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకాశ్మీర్‌లో జరిగిన పునర్విభజనతో తెలుగు రాష్ట్రాలతో పోల్చడం తగదని ధర్మాసనం పేర్కొంది. పునర్విభజన నోటిఫికేషన్ నుండి తెలుగురాష్ట్రాలను మినహాయించడంలో కేంద్రానికి ప్రత్యేక ఉద్దేశ్యం లేదని, ఇందులో రాజ్యాంగ ఉల్లంఘన లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.

శ్రీకాకుళం, ఏలూరు జిల్లాల్లో

కుంభవృష్టి

- నీట మునిగిన వరిపొలాలు
- పలు ప్రాంతాలు జలమయం
- తీరం దాటిన వాయుగుండం



శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం తెలికిపెంట వద్ద ముంపునకు గురైన పొలాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శుక్రవారం నాడు శ్రీకాకుళం, ఏలూరు జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. శ్రీకాకుళం జిల్లాలో గత 24 గంటల్లో 10.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. గార మండలం కళింగపట్నంలో అత్యధికంగా 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు సరుబుజ్జిలి మండలంలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఏలూరు జిల్లాలోని గిరిజన మండలాల్లోనూ, మెట్ట ప్రాంతమైన జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, చింతలపూడి తదితర ప్రాంతాల్లోనూ ఎడతెరిలేని వర్షం కురిసింది. దీంతో, జనజీవనం స్తంభించింది. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి, పిఠాపురంలో భారీ వర్షం కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, రాజమహేంద్రరం రూరల్, కొవ్వూరు, కడియం, రాజానగరం, పెరవలి, చాగల్లు తదితర మండలాల్లో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకూ చెదురుమదురు జల్లులు పడుతూనే ఉన్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, అంబాజీపేట, పి.గన్నవరం, కొత్తపేట, ఆలమూరు, రామచంద్రపురం, కాట్రేనికోన, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, మొగల్తూరు, పెనుమంట్ర, ఆకివీడు తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలో ఎడతెరిపిలేని వానకు కితలంగి, పెదపాడు, గోరపూరు గెడ్డల్లో నీటి ప్రవాహలు పెరిగింది. మరోవైపు శుక్రవారం సాయంత్రం వాయుగుండం తీరం దాటినట్లు వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ, వాయవ్య దిశగా కదిలిన వాయుగుండం తీరం దాటిందని విశాఖ పట్నం వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా రానున్న నాలుగు రోజుల పాటు ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉత్తరకోస్తా జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి : హోంమంత్రి సూచన

తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాయలంలోని స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ (ఎస్ఇఒసి)లో ఎండి ప్రఖర్‌జైన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ప్రాజెక్టు మేనేజర్లతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ, హోమ్ శాఖ మంత్రి వంగలపూడి శుక్రవారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో సంభవించే వాయుగుండాలు, భారీ వర్షాలు, చెదురుమదురుగా కురిసే వర్షాలు, తుపానులు, వరదలు వంటి వాటి పట్ల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను రూపొందించి అమలు చేయాలని, తీరప్రాంత కార్యకలాపాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించింది. అత్యవసర సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలని ప్రజలను కోరారు. హోర్డింగ్స్, శిథిలావస్థలోని భవనాల గోడలు, వృక్షాల వద్ద నిలబడరాదని సూచించారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తించిన హాట్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయం చేసుకొని గండ్లు పడిన ప్రాంతాల్లో వెంటనే మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. విపత్తుల పట్ల సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని కోరారు.

'ఎస్ఐఆర్'.. ప్రజాస్వామ్యంపై దాడే

- కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన
- రాజ్యసభ సభ్యునిగా కమల్ హాసన్ ప్రమాణ స్వీకారం



రాజ్యసభ సభ్యునిగా ప్రమాణం అనంతరం సంతకం చేస్తున్న కమలహాసన్

8

కర్నూలులో డ్రోన్ మిస్సైల్ పరీక్ష

- ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిఎం చంద్రబాబు హర్షం

2



ఎన్ఇపికి సమిధలైన దళిత విద్యార్థులు

- ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలంలో 12 స్కూల్స్ విలీనం
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు

3

జీరో పావర్టీకి 3 విధానాలు

- మార్గదర్శకుల్లో నమ్మకాన్ని కలిగించండి
- సమీక్షలో చంద్రబాబు ఆదేశం



నిరుపేద కుటుంబాలను సంపన్నులు దత్తత తీసుకొనేందుకు చేపట్టిన 'పి-4 మార్గదర్శి' లోగోను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం అమలు చేస్తున్న పి-4 కార్యక్రమాన్ని మూడు విధానాల్లో కొనసాగించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. శుక్రవారం పి-4పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంగారు కుటుంబాన్ని మార్గదర్శి దత్తత తీసుకోవడం, వారికి ఆర్థికేతర సాయాన్ని అందించడం మొదటి విధానంగా ఉంటుందని చెప్పారు. దీనికి కాలపరిమితి ఉండదని చెప్పారు. రెండో విధానంలో 'ఫండ్ ఏ నీడ్' కింద ఎవరికి ఆర్థిక అవసరాలు ఉంటాయో వారికి నగదు సాయం చేస్తారని, దీనికి కాలపరిమితి ఉంటుందని చెప్పారు. మూడో విధానంలో గ్రామాలను, మండలాలను దత్తత తీసుకుని అక్కడి కమ్యూనిటీ అవసరాలు తీర్చడం చేయాల్సి ఉంటుందని వివరించారు. కార్పొరేట్ సంస్థల నుంచి సామాజిక బాధ్యతగా మూడో విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే పి-4లో భాగస్వాములుగా వ్యవహరిస్తున్న కెపిఎంజి, మిలాప్, తమ్మడ, భవ్య, బార్గో, ప్రాజెక్టు డీప్ సంస్థలు మరింత కీలకంగా వ్యవహరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

పంద్రాగస్టుకి 15 లక్షల బంగారు కుటుంబాలు

వచ్చే నెల 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఇప్పటివరకు 5,74,811 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోగా, 57,503 మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం లక్ష్యం నెరవేరాలంటే మరో రెండు లక్షల మంది మార్గదర్శులు రావాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా బంగారు కుటుంబాల దత్తత జరిగిందని, విశాఖ చివరి స్థానంలో ఉందని అధికారులు చెప్పారు. దత్తత తీసుకున్న కుటుంబాలకు ఎప్పటికప్పుడు ఆటోమేటెడ్ విధానంలో సంక్షిప్త సమాచారాన్ని అందిస్తున్నామని వివరించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ పి-4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతలపై నిర్వహిస్తున్న సర్వేను వచ్చే నెల పదో తేదీలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. మార్గదర్శులు అందించే ఆర్థిక, ఆర్థికేతర సాయంపై ఆయా కుటుంబాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో తాము చేస్తున్న పనికి ఫలితాలు వస్తున్నట్లు మార్గదర్శుల్లో నమ్మకాన్ని కూడా కలిగించాలని స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల వివరాలను, వారు చేస్తున్న కార్యక్రమాల మిగతా 5లో

రాజస్థాన్‌లో ఘోరం

- పాఠశాల భవనం కుప్పకూలి ఏడుగురు విద్యార్థుల మృతి

జైపూర్ : బిజెపి పాలిత రాజస్థాన్‌లో శుక్రవారం పెనువిషాదం చోటు చేసుకుంది. ఝలావర్ జిల్లా పిప్లోడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్న భవనంలోని కొంతభాగం కుప్పకూలడంతో ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. సంఘటననా స్థలంలోనే ఐదుగురు మరణించారు. ఉదయం 7:45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. భారీ శబ్ధంతో భవనం కూలిపోవడం విన్న స్థానికులు అక్కడకు చేరుకుని శిథిల్లాలో చిక్కుకుని ఉన్న చిన్నారులను వెలికితీశారు. అత్యవసర సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాద సమయంలో పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు చెప్పారు. గాయపడిన చిన్నారులందరినీ స్థానిక ఆసుపత్రికి తరలించారు. వీరిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో ఝలావర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అదాని పోర్టులో మెరుపు సమ్మె

రవాణా స్తంభించడంతో దిగొచ్చిన యాజమాన్యం




మెరుపు సమ్మెకు దిగిన అదానీ పోర్టు కార్మికులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

అదాని కృష్ణపట్నం పోర్టులో కార్మికులు మెరుపు సమ్మె చేశారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా తమకు న్యాయంగా అందాల్సిన జీతాలు అందడం లేదంటూ బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోర్టు డ్రైవర్లు, ఆపరేటర్లు, లోడర్ మిషన్ ఆపరేటర్లు ఒక్కసారిగా సమ్మెలోకి వెళ్లారు. అదాని పోర్టుగా మారిన తర్వాత కార్మికులు సమ్మెలోకి వెళ్లడం ఇదే ప్రథమం. కార్మికులు ఎనిమిది గంటలు పనిచేయాల్సి ఉండగా, అదాని యాజమాన్యం 12 గంటలు పని చేయిస్తోంది. జీతాలు సరిగా ఇవ్వడం లేదు. కొత్తగా వచ్చిన కార్మికులకు రూ.19 వేలు, సీనియర్‌కు కొంతపెంచి ఇస్తున్నారు. తమకు జీతాలు న్యాయబద్ధంగా ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మెరుపు సమ్మెకు దిగారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు సమ్మె కొనసాగడంతో పోర్టులో కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. లారీలు, ఓడలు, రైళ్లు అన్ని ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో, కార్మికులతో యాజమాన్యం చర్చలు జరిపింది. ఒప్పందం ప్రకారం అందరి కార్మికులకు రూ.3 వేలు జీతం పెంచుతున్నట్లు ప్రకటించారు. దీంతో, కార్మికులు సమ్మె విరమించారు. పోరాడి విజయం సాధించిన కార్మికులకు సిఐటియు కృష్ణపట్నం పోర్టు క్లస్టర్ కమిటీ అధ్యక్షులు గడ్డం అంకయ్య, కార్యదర్శి గోగుల శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. ఇవే కాకుండా కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్తులోనూ పోరాడి వాటిని పరిష్కరించుకోవాలని కోరారు.

మాల్దీవులుకు రూ.4,850 కోట్ల రుణం

- ప్రకటించిన భారత్
- స్వేచ్ఛా వాణిజ్యంపై ఇరు దేశాల చర్చలు



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రధాని మోడీ, మాల్దీవుల అధ్యక్షులు మహ్మద్ ముయిజ్జు.

మాలే : మాల్దీవులుకు రూ.4,850 కోట్ల రుణం (లైన్ ఆఫ్ క్రెడిట్)ను భారత్ ప్రకటించింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలు చర్చలు ప్రారంభించాయి. రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం ఉదయం ఇక్కడకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి వెలెనా ఎయిర్‌పోర్టులో మాల్దీవులు అధ్యక్షులు మహ్మద్ ముయిజ్జు, మంత్రులు స్వాగతం పలికారు. సైనికుల నుంచి మోడీ గౌరవ వందనం స్వీకరించారు. విమానాశ్రయంలో తనను కలిసి ప్రవాస భారతీయులతో మోడీ మాట్లాడారు. అనంతరం అధ్యక్షుడు ముయిజ్జుతో ద్వైపాక్షిక చర్చల్లో మోడీ పాల్గొన్నారు. మంత్రుల స్థాయిలోనూ చర్చలు జరిగాయి. అనంతరం మోడీ మీడియాతో మాట్లాడుతూ ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు ప్రారంభమైనట్లు తెలిపారు. ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం ఖరారుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. రక్షణ, భద్రతా రంగంలో పరస్పర సహకారం పరస్పర విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. మాల్దీవులు తన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని తెలిపారు. మాల్దీవులు అధ్యక్షుడు ముయిజ్జు మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలు ప్రారంభమయ్యాయని అన్నారు. మాల్దీవులు ఆర్థిక వ్యవస్థకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించడంలో భారత్ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ ఇరు దేశాలు డిజిటల్ పరివర్తన, ఇతర రంగాలకు సంబంధించిన అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయని తెలిపారు.

మూడేళ్లలో 'మెట్రో' పూర్తి

- పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ
- కన్సల్టెన్సీతో మెట్రో కార్పొరేషన్ ఒప్పందం

2


పి-4 మోడల్‌లో బిసి వసతి గృహాల అభివృద్ధి

- మంత్రి సవిత

2

మౌలిక వసతుల ఊసే లేదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఎదుట పోలవరం నిర్వాసితుల గోడు
- ప్రభుత్వానికి, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన



విఆర్.పురం మండలం రామవరంలో పోలవరం నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం తదితరులు

ప్రజాశక్తి- దేవీపట్నం, విఆర్.పురం, ఎటపాక విలేకరులు (అల్లూరి జిల్లా)

పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల ఊసే లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కూడిన బృందం ఎదుట పోలవరం నిర్వాసితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అల్లూరి జిల్లా దేవీపట్నంలోని చిన్నారి గండి కాలనీ, పెనికిలపాడు, సీతారాం కాలనీ, విఆర్.పురం మండలంలోని రామవరం, ఎటపాక మండలంలో నర్సింగపేట, రాయనపేట పునరావాస కాలనీల్లో సిపిఎం బృందం శుక్రవారం పర్యటించింది. ఆయా చోట్ల నిర్వాసితుల కష్టాలను తెలుసుకుంది. ఎటపాక మండలంలోని నర్సింగపేట, రాయనపేట పునరావాస కాలనీల్లో నివాసముంటున్న విఆర్.పురం మండలం గొందూరు, కొటారిగొమ్ము, శ్రీరామగిరి గ్రామాల నిర్వాసితులు తాము పడుతున్న ఇబ్బందులను బృందం తీసుకొచ్చారు. కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు లేవన్నారు. కరెంటు ఉన్నప్పుడే నీళ్లు వస్తున్నాయని, లేనిసమయంలో నీళ్లకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. వీధిలైట్లు లేకపోవడంతో విష సర్పాల భయం వెంటాడుతోందన్నారు. తమను ఇక్కడికి అధికారికంగా తరలించలేదని, అందుకే రేషన్, పింఛను కోసం తిరిగి స్వగ్రామానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. భూమికి భూమి అప్పగించినా అవి వ్యవసాయానికి పనికిరాకుండా ఉన్నాయని వాపోయారు. తమ పేర్లతో ఆన్‌లైన్‌లోకి భూమిని ఎక్కించలేదని తెలిపారు. కాలనీలో బురదగా ఉందని, బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ సిబ్బందిని కోరితే, స్వగ్రామాల నుంచి తెచ్చుకుని చల్లుకోండి అని బదులిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వస్వం త్యాగం చేసిన తమపట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వాపోయారు. రామవరంలో సిపిఎం బృందం ఎదుట నిర్వాసితులు తమ కష్టాలను తెలియజేశారు. తమ గ్రామంలో మొత్తం 270 పిడిఎఫ్ గృహాలు ఉన్నాయని, వాటిలో 104 గృహాలకు పోలవరం పునరావాస మిగతా 5లో

మూడేళ్లలో 'మెట్రో' పూర్తి

- పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ
- కన్సల్టెన్సీతో మెట్రో కార్పొరేషన్ ఒప్పందం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మూడేళ్లలో విశాఖ, విజయవాడ మెట్రో పూర్తి చేస్తామని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. రెండు నగరాల్లో మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక సహకారం, డిజైన్లు, పనుల పర్యవేక్షణ కన్సల్టెన్సీలు శిస్ట్రా, టిప్సాతో మంత్రి నారాయణ ఆధ్వర్యాన శుక్రవారం మెట్రోరైల్ కార్పొరేషన్ ఎంఒయు కుదుర్చుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖపట్నం మెట్రోకు టెండర్ నోటిఫికేషన్ ఇచ్చామని, రెండు రోజుల్లో విజయవాడకు కూడా ఇస్తామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం విశాఖ, విజయవాడలో మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మొత్తం వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 20 శాతం చొప్పున వాటా భరిస్తాయని, మిగిలిన 60 శాతం సాఫ్ట్‌లోన్ తీసుకుని నిర్మాణం చేపడతామని మంత్రి నారాయణ వివరించారు. విశాఖపట్నం ఫేజ్-1లో మూడు కారిడార్లలో రూ.11,498 కోట్ల అంచనాతో నిర్మాణం చేపడతామని, కారిడార్-1లో స్టీల్‌ప్లాంటు నుంచి కొమ్మాది జంక్షన్ వరకూ 34.40 కిలోమీటర్లలో 29 స్టేషన్లు ఉంటాయని పేర్కొన్నారు. కారిడార్-2లో గురుద్వారా నుండి ఓల్డ్ పోస్టాఫీసు వరకూ 5.07 కిలోమీటర్ల మేర ఆరు స్టేషన్లు, కారిడార్-3లో తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకూ 6.75 కిలోమీటర్లలో ఏడు స్టేషన్లు ఉంటాయని తెలిపారు. మొత్తం 46.23 కిలోమీటర్ల మేర 42 స్టేషన్లలో


ఒప్పందాల సందర్భంగా పరస్పరం అభినందించుకుంటున్న మంత్రి నారాయణ, టిప్సా, శిస్ట్రా కన్సల్టెన్సీల ప్రతినిధులు

ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తాటిచెట్లపాలెం నుండి మధురవాడ వరకూ 20 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ లైను ఏర్పాటు చేస్తామన్నారు. 99.75 ఎకరాల భూ సేకరణ కోసం రూ.847 కోట్లు ఖర్చవుతుందని వివరించారు. విశాఖకు కేంద్ర నిధులు రూ.2,018 కోట్లు, రాష్ట్ర నిధులు రూ.2,863 కోట్లు, భూసేకరణ కోసం రూ.847 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రం నుండి వెచ్చించే నిధులను విఎంఆర్‌డిఎ నుండి తీసుకుంటామని, మిగిలిన 60 శాతం నిధులు తక్కువ వడ్డీకి రుణాలందించే బ్యాంకుల నుండి తీసుకుంటామని తెలిపారు. విజయవాడలో ఫేజ్-1లో రెండు కారిడార్లను రూ.10,118 కోట్ల అంచనాతో చేపడుతున్నామని తెలిపారు. కారిడార్-1లో పండింట్ నెహ్రూ బస్టేషన్ నుండి గన్నవరం వరకూ 25.95 కిలోమీటర్లు, కారిడార్-2లో పిఎన్‌బిఎస్ నుండి పెనమలూరు వరకూ 12.45 కిలోమీటర్లు మొత్తం 33 స్టేషన్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. విజయవాడలో రామవరప్పాడు నుండి ఎనికేపాడు వరకూ డబుల్ డెక్కర్ లైను వస్తుందని, మొత్తం 38.40 కిలోమీటర్లలో 91 ఎకరాలు భూసేకరణకు రూ.1,152 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ప్రాజెక్టు మొత్తం వ్యయంలో రాష్ట్ర వాటా సిఆర్‌డిఎ నుండి తీసుకుంటామని, 60 శాతం బ్యాంకుల నుండి తీసుకుంటామని పేర్కొన్నారు. ఎంఒయులో మంత్రి నారాయణతోపాటు మెట్రో ఎమ్‌డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి.. ఉపాధ్యాయ సంఘాలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధన కోసం మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు కమిటీని రూపొందించాలని సంఘాల నాయకులు కోరారు. ప్లస్ టు హైస్కూళ్లను ఇంటర్మీడియట్ బోర్డుకు అప్పగించొద్దని, యథాతథంగా వాటిని కొనసాగించాలని తెలిపారు. బోధనకు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్న దాదాపు 70 రకాల యాప్‌లను తొలగించాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. వీటితో పాటు పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖ మంత్రి దృష్టికి వీటిని తీసుకెళ్తామని నాయకులకు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ వెంకటేశ్వర్లు (యుటిఎఫ్), సాయి శ్రీనివాస్ (ఎస్‌టియు), హృదయరాజు (ఎపిటిఎఫ్-1938), మంజుల (ఎపిటిఎఫ్-257), కృష్ణయ్య (పిఆర్‌టియు), ప్రకాష్‌రావు (ఆప్టా), శ్రీనివాసరావు (హెచ్ఎంఎ), నరహరి (డిటిఎఫ్), మనోజ్ (బిటిఎ), అశోక్‌రెడ్డి (వైఎస్ఆర్‌టిఎ) తదితరులు పాల్గొన్నారు.


ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాకినాడలో రోడ్డు ప్రమాదం

- ఆటో డ్రైవర్ సహా తల్లీ కూతురు మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవలలో జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో సహా తల్లి, కూతురు మృతి చెందారు. ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ ఏటిమొగకు చెందిన ముగ్గురు మహిళలు తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీలోని చినవలసలలో బంధువులను పరామర్శించడానికి ఆటోలో బయలుదేరారు. ఆటో పటవల హైస్కూల్ సమీపానికి వచ్చేసరికి యానాం నంచి కాకినాడ వెళుతున్న ప్రయివేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యానాం కురసాంపేటకు చెందిన ఆటో డ్రైవర్ కూరాకుల కుమార్‌రాజు (30), ఏటిమొగకు చెందిన పోతాబత్తుల దుర్గ (55), లంకే భవాని (35) అక్కడికక్కడే మరణించారు. దుర్గ, భవాని తల్లీకుమార్తెలు. మరో మహిళ ఓలేటి ఆదిలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108లో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా ప్రాంతాన్ని కాకినాడ రూరల్ సిఐ చైతన్యకృష్ణ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, ఎఎస్ఐ సత్యనారాయణ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసుల విచారణకు హాజరైన ప్రసన్నకుమార్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం మూలపేటలోని డిఎస్‌పి కార్యాలయంలో పోలీసుల విచారణకు హాజరయ్యారు. సుమారు మూడు గంటలపాటు పోలీసులు ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు ప్రసన్నకుమార్‌రెడ్డి జవాబులిస్తూ లిఖిత పూర్వకంగా రిపోర్టు రాసినట్లు తెలిసింది.

విశాఖ డెయిరీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ డెయిరీలో 305 మంది కాంట్రాక్ట్ కార్మికులను ఏ విధమైన నోటీసులూ లేకుండా యాజమాన్యం గత నెల 10న తొలగించింది. ఈ నేపథ్యంలో వారిని విధుల్లోకి తీసుకోవాలంటూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తొలుత జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, గురజాడ జంక్షన్, ఆశీలుమెట్ట మీదుగా తిరిగి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన ధర్నానుద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ మాట్లాడుతూ విశాఖ డెయిరీలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. యూనియన్ పెట్టుకున్నారనే నెపంతో చట్ట విరుద్ధంగా 15 సంవత్సరాల పైబడి పని చేస్తున్న కార్మికులను డెయిరీ యాజమాన్యం తొలగించడం దుర్మార్గమన్నారు. దీనిపై జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ స్పందిస్తూ అందరినీ విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు డైరెక్షన్ ఇచ్చారన్నారు. అందుకు ఆయనా అంగీకరించిన యాజమాన్యం మాత్రం వారిని విధుల్లోకి


విశాఖ డెయిరీ కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

తీసుకోవడం లేదు. కాంట్రాక్ట్ కార్మికులతో పాటు పర్మినెంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నలుగురిని సస్పెండ్ చేస్తూ డెయిరీ యాజమాన్యం నోటీసులు ఇచ్చిందన్నారు. యాజమాన్యం స్పందించకుంటే దీర్ఘకాల పోరాటానికి కార్మికవర్గం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ధర్నాకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జి.నాయనబాబు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రెడ్డి వెంకటరావు సంఘీభావం తెలిపారు. ధర్నాలో సిఐటియు గాజువాక జోన్ నాయకులు ఎ నూకేశ్వరరావు, విశాఖ డెయిరీ కాంట్రాక్టు లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రాంబాబు, డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ రమణ, కాంట్రాకు కార్మికులు పాల్గొన్నారు.

'వీరమల్లు' అభూత కల్పనలపై పవన్ స్పందించాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హరిహర వీరమల్లు చిత్ర కథలో అభూత కల్పనలపై పవన్‌కల్యాణ్ స్పందించాలని, చారిత్రక వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతాయుత స్థానంలో ఉన్న పవన్ కల్యాణ్ హీరోగా హరిహర వీరమల్లు చిత్రాన్ని మలచటం విచారకరమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కట్టుకథతో హిందూ, ముస్లిముల మధ్య అపోహలు పెంచేలా ఈ చిత్ర కథాంశం ఉండటం సరైంది కాదన్నారు. 1618లో జన్మించిన ఔరంగజేబు, 1687లో గోల్కొండ మీద దండయాత్ర చేశాడని చరిత్ర చెబుతోందన్నారు. వీరమల్లు చనిపోయి అప్పటికి 200 ఏళ్ళకు పైగా అయ్యిందని, ఈ నేపథ్యంలో ఔరంగజేబుతో వీరమల్లు యుద్ధం ఎలా చేశారని ప్రశ్నించారు.

మొత్తం పంటను కొనుగోలు చేయాల్సిందే

- గ్రామ స్థాయిలో పొగాకు రైతుల నిరసనలకు రైతు సంఘాల పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

పొగాకు కొనుగోళ్లపై ఆంక్షలు ఉపసంహరించుకొని, రైతుల వద్ద ఉన్న మొత్తం పంటను కొనుగోలు చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించాయి. గుంటూరులో అఖిల పక్ష రైతు సంఘాల సమావేశం నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, ఇతర రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అనేక పోరాటాల ఫలితంగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోళ్లు చేపట్టిందని తెలిపారు. అయితే, ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగడంలేదన్నారు. 80 మిలియన్ కెజిల లక్ష్యానికి ఇప్పటి వరకు సగం కూడా కొనుగోలు చేయలేదని తెలిపారు. చిన్న, సన్నకారు రైతుల వద్ద పంట అమ్ముడుపోలేదన్నారు. ఈ క్రమంలో ప్రతి రైతు నుండి 20 క్వింటాళ్లే కొంటామని, ఆగస్టు 20వ తేదీతో కొనుగోళ్లు నిలిపివేస్తామని ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. గత ఏడాది క్వింటాలు ధర రూ.18 వేలు ఉంటే.. ఈ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సంవత్సరం కనీసం రూ.5 వేలు కూడా దక్కడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం చివరి కాడ వరకూ కొనుగోలు చేయాల్సిందేనని, లేనిపక్షంలో అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద, గ్రామాలలో సోమవారం నుండి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పొగాకు రైతులకు పిలుపునిచ్చారు. కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లోనూ రైతులకు న్యాయం జరగట్లేదని తెలిపారు. సమావేశంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు సంఘం గుంటూరు, బాపట్ల జిల్లా కార్యదర్శులు కె.అజయ్, టి.రామారావు, ప్రకాశం జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.శివాజీ, కిసాన్ ఫెడరేషన్ నాయకులు కె.గణేష్‌బాబు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పి.వి.జగన్నాథం, కె.విఠల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


భీమిలి బీచ్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

భీమిలి తీరంలో అక్రమ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - భీమునిపట్నం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా భీమిలి సముద్ర తీరంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాన్ని కేంద్ర పర్యావరణ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు శుక్ర వారం పరిశీలించారు. వైసిపి మాజీ ఎంపి విజయ సాయి రెడ్డి కుమార్తె నేహా రెడ్డి అక్కడ చేపట్టిన నిర్మాణాలపై ఎపి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఫిర్యాదు మేరకు ఇప్పటికే కేసు నమోదైన విషయం తెలిసిందే.

ఆ నిర్మాణాలు పర్యావరణ చట్టం నిబంధనలు ఉల్లంఘించేవిగా ఉన్నాయని ఈ నెల 10న భీమిలి కోర్టులో ఫిర్యాదు అనంతరం వారిపై కేసు నమోదు చేశారు. సంబంధిత నిర్మాణాలు అక్రమమైనవని ఆరోపిస్తూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయమూ తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర పర్యావరణ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఎన్ఐఒ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ మోటూరి శ్రీరామకృష్ణ, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ విఎస్.శర్మ, విశాఖ కాలుష్య నియంత్రణ మండలి ఇఇ పివి.ముకుందరావు, హెడ్ క్వార్టర్ ఇఇ సుభాన్, చెన్నై రీజినల్ డైరెక్టరేట్ సైంటిస్ట్ సౌమ్య దుర్గప్ప, డాక్టర్ మురళీ కృష్ణ చిమటా, తదితరులు ఆ ప్రాంతంలో పర్యటించారు. నాడు 588 మీటర్ల పొడవున ప్రహరీ నిర్మాణం జరగ్గా 321.70 మీటర్ల నిర్మాణ పనులను ఇప్పటి వరకు కూల్చి వేసినట్లు జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు కేంద్ర బృందం ప్రతినిధులకు వివరించారు. తాము పరిశీలించిన అంశాలను నివేదిక రూపంలో కోర్టు ముందు ఉంచుతామని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఒకటో జోన్ పట్టణ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణ, ఇంజనీరింగ్ విభాగం ఇఇ సురేష్ పాల్గొన్నారు. అనంతరం తీరం పక్కనే ఉన్న గెడ్డకు ఇరువైపులా నిర్మించిన గోడను, బి జాగ్ రెస్టారెంట్‌ను కేంద్ర బృంద ప్రతినిధులు పరిశీలించారు.

గ్రామ సరిహద్దులు తేల్చేందుకు కసరత్తు

- 1 నుంచి 90 రోజుల్లో ప్రక్రియ పూర్తి
- సర్వేయర్లను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల సరిహద్దుల లెక్కలు తేల్చేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం రెవెన్యూ శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. సరిహద్దులతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూముల సర్వేను తొలుత పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రైవేట్ భూములను సర్వే చేయాల్సి ఉంటుందని ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. గ్రామ సరిహద్దులకు సంబంధించిన రీ ఫిక్సేషన్, డేటా సేకరణను సత్వరమే తీసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించాలని గ్రామ సర్వేయర్లను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ భూముల రీసర్వే, డేటా సేకరణ ఆగస్టు ఒకటిన ప్రారంభించి నవంబరు వరకు 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను డిఎస్‌ఎల్‌ఒలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో బృందానికి రోజుకు 30 ఎకరాలు లక్ష్యం కాగా, ప్రభుత్వ భూములకు ఒకవారం ముందుగానే నోటీసు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ భూముల రీ సర్వే జరిగే సమయంలో ఆయా గ్రామాలన్నింటినీ ఎఫ్‌పిఒఎల్ఆర్‌ను సంబంధిత విఆర్‌ఒలు నిర్వహించాల్సి ఉంది. గ్రామ సరిహద్దు, ప్రభుత్వ భూముల రీసర్వే, ప్రైవేట్ భూముల రీసర్వే కోసం డిఎస్‌ఎల్‌ఒలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు.

డిసెంబరు 1 నుంచి ప్రైవేట్ భూముల రీ సర్వే

రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే జరగని గ్రామాల్లోని ప్రైవేట్ భూములు సర్వే డిసెంబరు ఒకటి నుంచి ప్రారంభించాలని రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టం చేసింది. ఈ ప్రక్రియకు ముందుగా నవంబరు 2న ప్రైవేట్ భూముల సర్వే కోసం ర్యాలీలు, గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. రీ సర్వే ప్రక్రియ, దానివల్ల వచ్చే లాభాలు, ప్రయోజనాల గురించి వివరించడానికి 'మెగా రీసర్వే అవగాహన శిబిరాలు' నిర్వహించడం తప్పనిసరని పేర్కొంది. ఒక్కో బ్లాక్ పూర్తి చేయడానికి వీలుగా 40 రోజుల కార్యాచరణ ప్రణాళికలను డిఎస్‌ఎల్‌ఒలు సిద్ధం చేయాలని, డిసెంబరు 2027 నాటికి బ్యాలెన్స్ గ్రామాల సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు రెవెన్యూశాఖ వర్గాలు స్పష్టం చేశాయి.

బిజెపి చేతుల్లో కీలు బొమ్మలుగా ఎంపిలు : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఎంపిలు బిజెపి చేతుల్లో కీలుబొమ్మలుగా మారారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు.

11 ఏళ్లుగా ఒక్కరూ విభజన హామీలపై నోరెత్తడం లేదన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఆమె మాట్లాడారు. ప్రత్యేక హోదాకు మించి ప్యాకేజీ ఇస్తామన్న ప్రధాని మోడీ..చివరకు ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. రాజధానిని కేంద్రమే నిర్మించి ఇవ్వాల్సివున్నా..నిధులివ్వకుండా అప్పులతో సరిపెడుతున్నారని వాపోయారు. పోలవరం, కడప స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు ఇలా అన్నీ విషయాల్లోనూ కేంద్రం మొండి చేయి చూపుతోందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత ఉంటే కేంద్రాన్ని రాష్ట్ర ఎంపీలు ప్రశ్నించడం లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో డ్రోన్ మిస్సైల్ పరీక్ష

- ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిఎం చంద్రబాబు హర్షం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలనులో ఉన్న డిఆర్‌డిఒకు చెందిన నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్‌లో యుఎవి లాంచ్ ప్రెషిషన్ గైడెడ్ మిస్సైల్ (యుఎల్‌పిజిఎం-వి3) ట్రయల్ శుక్రవారం విజయవంతమైంది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ రాజ్‌నాథ్ సింగ్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆయుధం ఫిక్స్‌డ్వింగ్ మానవ రహిత విమానాలను కూల్చేందుకు వినియోగిస్తారని, ఇక్కడ జరుగుతున్న ప్రయోగాలతో భారత్ డ్రోన్ యుద్ధ తంత్రంలో ముందంజవేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. యుఎల్‌పిజిఎం శ్రేణి ఆయుధాలను తపస్-బిహెచ్, ఆర్చర్ ఎని యుఎవిల కోసం అభివృద్ధి చేశారని, ఇది చాలా తక్కువ ధరతో ఉత్పత్తి చేయవచ్చని, అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదిస్తాయని, అత్యంత సమీపం నుంచి జరిగే పోరాటాల్లో ఫైర్ అండ్ ఫర్గెట్ వ్యవస్థ ఆధారంగా దీనిని ప్రయోగించవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా ఓర్వకలు మండలం పాలకొలనులో ఉన్న డిఆర్‌డిఒలోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్‌లో మానవ రహిత క్షిపణి ప్రయోగం విజయవంతం శుభ పరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

పి-4 మోడల్‌లో బిసి వసతి గృహాల అభివృద్ధి

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి వసతి గృహాలను పి-4 మోడల్‌లో అభివృద్ధి చేయనున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. దాతలు, ఎన్‌టిఆర్ విదేశీ విద్య పథకం కింద లబ్ధిపొంది ఉన్నత స్థితిలో ఉన్న విద్యార్థుల సాయం తీసుకోనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2016-17 మధ్య ఎన్‌టిఆర్ విదేశీ విద్య పథకం కింద లబ్ధిపొందిన విద్యార్థులు ఎందరో నేడు అత్యున్నత స్థానాల్లో ఉండటం సంతోషించాల్సిన అంశమన్నారు. ప్రభుత్వ సహకారంతో ఆర్థికంగా ఉన్నత స్థానాల్లో ఉన్నవారు తమకు తోచిన రీతిలో బిసి వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సాయమందించడానికి ముందుకు రావాలని కోరారు. ఇటువంటి వారిని గుర్తించి ప్రత్యేకంగా ఇ-మెయిల్స్‌ను పంపినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఏదైనా వసతి గృహాన్ని లేక ఒకరిద్దరు విద్యార్థులను దత్తత తీసుకోవచ్చన్నారు. వసతి గృహాల్లో వారి స్థాయికి తగినట్లుగా మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, మరమ్మతులు, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, వంటి పనులకు ఆర్థిక సాయమందించవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ సదుపాయం కోసం సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు సహకారం అందించవచ్చన్నారు. దాతలు అందించిన నిర్మాణాలు, సామగ్రిపై వారి పేర్లను ప్రచురిస్తామని తెలిపారు. సామాజిక సేవ పట్ల ఆసక్తి కలిగి ఉన్నవారు directorapbcwelfare@gmail.com మెయిల్‌కు, లేదా 63008-76401, 79893-44521 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.


బొబ్బిలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద భూ బాధితుల ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి/రామభద్రపురం (విజయనగరం)

ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న భూమిని ప్రభుత్వం ఎటువంటి సమాచారం లేకుండా, ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా తీసుకోవడం అన్యామంటూ గిరిజన రైతులు ధర్నా చేపట్టారు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం కొట్టక్కి రెవెన్యూలో ఎపిఐఐసి ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఇ పార్కు భూ బాధితులు బొబ్బిలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, పిసిసి సభ్యులు ముVవల శ్రీనివాసరావు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు మాట్లాడారు. గిరిజనులకు అన్యాయం చేస్తే పోరాటం చేస్తామన్నారు. కారేడువలస, కాకర్లవలస గ్రామాల గిరిజనుల వేసిన మామిడి, జీడి మొక్కలను, మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేస్తున్న ప్రభుత్వ భూములను ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. గిరిజనుల భూముల సమీపంలో ఖాళీ భూములు ఉన్నప్పటికీ వాటి జోలికి వెళ్లకుండా గిరిజనులు సాగు చేసి జీవనోపాధి పొందుతున్న భూములను తీసుకోవడం దుర్మార్గమన్నారు. గిరిజనుల భూములను వారికి తిరిగి అప్పగించి నాశనం చేసిన పంట, తోటలకు నష్టపరిహారం ఇవ్వాలని, లేకుంటే భూములకు నష్టపరిహారం చెల్లించి వేరే చోట భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, గిరిజనులు పాల్గొన్నారు.

బాధితులతో కలిసి భూముల పరిశీలన

అంతకుముందు కాకర్లవలస గిరిజన భూములను తమ్మినేని సూర్యనారాయణ పరిశీలించారు. 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం సుమారు 187 ఎకరాల భూమిని రూ.7.48 కోట్లకు ఎపిఐఐసికి విక్రయించిందన్నారు. అయితే అప్పటికే ఈ భూములు గిరిజనుల సాగు హక్కులో ఉన్నాయని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఏ రెవెన్యూ అధికారి ఈ భూముల స్థితిగతులను పరిశీలించకుండా పార్కుకు కేటాయించడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బలస శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా మాదిరెడ్డి ప్రతాప్

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలువురు ఐపిఎస్ అధికారులు బదిలీలు, నియామకాలు శుక్రవారం జరిగాయి. ఈ మేరకు సిఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. విపత్తు నిర్వహణ, అగ్నిమాపకశాఖ డిజి మాదిరెడ్డి ప్రతాప్‌ను రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో అగ్నిమాపకశాఖ డైరెక్టర్ వెంకటరమణకు డిజిగా అదనపు బాధ్యతలు కేటాయించారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఐపిఎస్ అధికారి శ్రీధర్‌రావును సిఐడి ఎస్‌పిగా నియమించారు.


రెండు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- రెండు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ జూరాల నుంచి 82,729 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 35,296 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి రెండు గేట్ల ద్వారా 53,856 క్యూసెక్కులు దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 882.50 అడుగులకు చేరగా నీటి నిలువ సామర్థ్యం 202.0439 టిఎంసిలుగా నమోదైంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడుకు 29,375, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,992 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రెండు విద్యుత్ కేంద్రాల నుంచి 66,331 క్యూసెక్కులు, శ్రీశైలం రెండు గేట్ల ద్వారా 53,856 క్యూసెక్కులు కలిపి దిగువ సాగర్‌కు 1,20,187 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తల్లికి వందనం లక్షమందికి ఎగ్గొట్టారు

- వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లక్ష మందికి తల్లికి వందనం పథకాన్ని ఎగ్గొట్టారని, ఆడబిడ్డ నిధి లేదని తేలిపోయిందని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. బాబూ ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుండి మంచి స్పందన వచ్చిందన్నారు. పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో సజ్జల శుక్రవారం మాట్లాడారు. ప్రజల్లోకి వెళ్లడంతోపాటు పార్టీ పటిష్టతపైనా దృష్టి పెట్టాలన్నారు. వైసిపి కేడర్‌ను కదిలించలేరని కూటమి నాయకులకు అర్థమైందని పేర్కొన్నారు. అలాగే అన్ని స్థాయిల్లోనూ పార్టీలో పదవులను పూర్తి చేయాలని సూచించారు.

సంక్షోభంలో విద్యా రంగం : శైలజానాథ్

కూటమి పాలనలో విద్యారంగం సంక్షోభంలో పడిందని మాజీ మంత్రి శైలజానాథ్ విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో సిఎం చంద్రబాబు ఆడుకుంటున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా అబద్ధాలు ఆడుతున్నారని, లోకల్, నాన్‌లోకల్ పేరుతో లబ్ధిదారులను తగ్గించే కుట్రలు చేస్తున్నారని అన్నారు.

25 వేల కోట్ల పెండింగ్ బకాయిలు : ఎపిజిఇఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులకు వివిధ రకాలుగా చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు సుమారు రూ.25వేల కోట్ల వరకు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తెలిపింది. రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ప్రతిపాదించిన అజెండాలోని అంశాలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ ఎం.రమేష్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రణాళికబద్ధంగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఈ ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఐఎఎస్ అధికారుల నేతృత్వంలో ఏక వ్యక్తి పే రివిజన్ కమిషన్ కాకుండా సిట్టింగ్/ విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో త్రిసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, తక్షణమే ఐఆర్‌ను ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. సెక్రటరియేట్ శాఖాధిపతి ఉద్యోగులతో సమానంగా సిఆర్‌డిఎ పరిధిలో పనిచేసే అందరు ఉద్యోగులకు ఇంటి అద్దె (హెచ్‌ఆర్‌ఎ) చెల్లించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల విధానం లోప భూయిష్టంగా ఉందని, ఒక పారదర్శకమైన ఏకరీతి నిర్దిష్టమైన బదిలీ విధానాన్ని రూపొందించాలని కోరారు.

ఎన్ఇపికి సమిధలైన దళిత విద్యార్థులు

- ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలంలో 12 స్కూల్స్ విలీనం
- వాగులు, పొలాలు, శ్మశానాలు దాటుతూ మరో పాఠశాలకు
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఒంగోలు

జాతీయ విద్యావిధానానికి (ఎన్ఇపి) దళిత విద్యార్థులు సమిధులవుతున్నారు. దళిత విద్యార్థులకు శాపంగా మారింది. బిజెపి పాలిత రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాలు ఈ విధానాన్ని వ్యతిరేకించినా మన ప్రభుత్వం మాత్రం శరవేగంగా అమలు చేస్తోంది. ఒక్క ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలంలో 15 స్కూల్స్ మూసివేస్తే అందులో 12 స్కూల్స్ దళితుల కాలనీల్లోనివే. ఇటీవల కెవిపిఎస్ నాయకులు ప్రకాశం జిల్లాల్లో పర్యటించిన సందర్భంగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. మనువాద పాలకులు అవలంభిస్తోన్న విధానాల వల్ల దళిత విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. స్కూల్స్ విలీనం అయిన ఈ ఒక్క మండలంలోనే 28 మంది దళిత విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. మరో పాఠశాలకు పంపలేక తల్లిదండ్రులు తమతోపాటు పనులకు తీసుకువెళు_న్నారు.

హనుమంతునిపాడు మండలంలోని మంగంపల్లి స్కూలు విద్యార్థులను నందనవనం పాఠశాలలోకి విలీనం చేశారు. మంగంపల్లి ఎస్‌సి పేటలో మూడు నుండి ఐదు తరగతి చదువుకునే విద్యార్థులు 28 మంది ఉన్నారు. వీరు ప్రతి రోజు నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారు. మధ్యలో రెండు వాగులు దాటాల్సి వస్తోంది. విష సర్పాలు, అడవి జంతువులు, కోతుల బెడద తీవ్రంగా ఉంటోంది. మార్గమధ్యలో బెల్ట్‌షాపు కూడా ఉంది. విద్యార్థినీలు స్కూలుకు వెళ్లడానికి చాలా ఇబ్బందికరమైన



విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేస్తున్న నాయకులు

పరిస్థితులు ఉన్నాయి. తాళ్లవారిపల్లె దళితపేట నుంచి నందనవనం స్కూలుకు ఐదు కిలోమీటర్లు దూరం ఉంటుంది. ప్రతిరోజు విద్యార్థులు పొలాల గట్లు వెంబడి ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లాలి. కొండారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలోని మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులను కోటతిప్పల ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. రానూ పోనూ ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉంటుంది. మార్గమధ్యలో రెండు వాగులు దాటి ప్రయాణం చేయాలి. ప్రతిరోజూ భయాందోళనలతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లి రావాల్సి వస్తోంది.

రసీదుపురం దళితపేట నుంచి కోట తిప్పల స్కూలుకు 28 మంది విద్యార్థులను విలీనం చేశారు. చిన్న ముప్పలపాడు మాదిగ పల్లికి చెందిన మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులను ఉప్పలపాడు హైస్కూలులో విలీనం చేశారు. ఆ పాఠశాలకు వెళ్లాలంటే ప్రమాదకరమైనటువంటి మూడు వాగులు దాటి ప్రయాణించాల్సి వస్తోంది. కూటగుండ్ల దళితవాడకు చెందిన మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులను కూటగుండ్ల జనరల్ పాఠశాలలో విలీనం చేశారు. విలీనం చేసిన స్కూల్లో కేవలం పదిమందిలోపు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఆ పాఠశాలకు వెళ్లాలంటే మార్గమధ్యలో వాగు దాటాలి. రానుపోను రెండు కిలోమీటర్లు దూరం ఉంటుంది.

ఏకపక్షంగా విలీనం

అంధ్ర మాల్యాద్రి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఈ పాఠశాలల విలీనంతో ప్రభుత్వ నిబంధనలు ఎక్కడా అమలు చేయలేదు. బదిలీపై వెళ్తున్న ఎంఇఒ గుర్రం పెద్దిరాజు ఏకపక్షంగా పాఠశాల కమిటీ ఆమోదం లేకుండా విద్యార్థుల తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండా విలీనం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆందోళనలు చేయడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. విచారణ చేయించి న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు.

నానో ఎరువుల వినియోగం పెంచాలి

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నానో ఎరువుల వినియోగాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. కోరమండల్ సంస్థ ఆధ్వర్యాన 'వ్యవసాయం రంగంలో నానో ఎరువుల పరిజ్ఞానం' అనే అంశంపై విజయవాడలో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 21 లక్షల నానో బాటిల్ యూనిట్లను వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్లలో ఎరువులకు సబ్సిడీ రూపంలో కేటాయించిన మొత్తం రూ.95 వేల కోట్ల నుంచి రూ.1.70 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. నేలను జీవమున్న పదార్థంగా భావించి.. దానిని బలోపేతం చేయడానికి తగినంత సేంద్రియ పదార్థాలను అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఎరువుల సబ్సిడీ రూ.12,500 కోట్లుగా ఉందని, క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులందరూ రైతులకు నానో సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ.. రైతులకు నానో ఎరువుల దీర్ఘకాల ప్రయోజనాలను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ డైరెక్టర్ పివి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. కోరమండల్ సంస్థ ప్రతినిధులు సుబ్రమణ్యం, రోషన్ మమ్మెస్, సుబ్బారెడ్డి సందేహాలను నివృత్తి చేశారు.

గుండెపోటుతో ఆర్‌టిసి డ్రైవర్ మృతి

- ప్రయాణికులకు తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ (అన్నమయ్య జిల్లా)

బస్సు నడుపుతూ ఆర్‌టిసి డ్రైవర్ గుండెపోటుకు గురవ్వడంతో స్టీరింగ్‌పైనే కుప్పకూలారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా రాయచోటిలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కావలి ఆర్‌టిసి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు కావలి నుంచి బెంగళూరుకు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున రాయచోటి పట్టణం మదనపల్లి రోడ్డులోకి రాగానే డ్రైవర్ షేక్ మొహమ్మద్ రసూల్ (55)కు గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన స్టీరింగ్‌పైనే కుప్పకూలారు. బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బైక్‌ను ఢీకొట్టి అక్కడే నిలిచిపోయింది. ప్రయాణికులు అప్రమత్తమై డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆయన మృతి చెందారు. బస్సుకు పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద ఘటన గురించి ప్రయాణికులు పోలీసులకు, ఆర్‌టిసి అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రమాద స్థలం నుంచి బస్సును రాయచోటి ఆర్‌టిసి డిపోకు తరలించారు. షేక్ మొహమ్మద్ రసూల్ మతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.500 కోట్లతో ఆలయాల పునర్నిర్మాణ పనులు : మంత్రి ఆనం

ప్రజాశక్తి - వేపగుంట (విశాఖపట్నం)

రాష్ట్రంలో రూ.500 కోట్లతో ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. విశాఖ జిల్లా సింహాచలంలోని శ్రీ వరహా లక్ష్మీ నరసింహస్వామిని ఆయన శుక్రవారం దర్శించుకున్నారు. మంత్రికి కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవాదాయ శాఖలో ఆలయ పాలక వర్గాల నియామకం ప్రారంభించామని తెలిపారు. వీటిలో రూ.25 లక్షలు, కోటి రూపాయలు, 5 కోట్ల రూపాయలు ఆదాయం కలిగిన వాటిని గుర్తించినట్లు తెలిపారు. ఐవిఆర్ఎస్, క్యూర్ కోడ్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత దేవాలయాల్లో పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు.

ఎవరి అండదండలూ అవసరం లేదు

- మాజీ ఎమ్మెల్సీ జూపూడి మద్దతును తిరస్కరించిన కరేడు రైతులు

ప్రజాశక్తి- ఉలవపాడు (నెల్లూరు)

కరేడులో జరుగుతోన్న భూ పోరాటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలిపేందుకు వచ్చిన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావుకు చేదు అనుభవం ఎదురైంది. తమకు ఎవరి అండదండలు వద్దని, ఎవరి దయాదాక్షిణ్యాల మీద మేము బతకడం లేదని గిరిజన మహిళలు ఎదురించి మాట్లాడారు. దీంతో, జూపూడి మిన్నుకుండిపోయారు. మీరందరూ ఐక్యంగా పోరాడితే మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని చెప్పి అంతటితో ముగించేశారు.మాజీ సిఎం జగన్‌హన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కరేడు పంచాయతీలోని రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామాల్లో జూపూడి ప్రభాకర్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామస్తులతో సభను నిర్వహించారు. ప్రయివేటీకరణకు తాము వ్యతిరేకించడం లేదని తెలిపారు. లక్షల ఎకరాల బీడు భూములు, వ్యవసాయానికి పనికిరాని భూములు వదిలేసి మూడు పంటలు పండే వ్యవసాయ భూములను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తీసుకుంటోందని ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తున్న దమనకాండ, ఈ అప్రజాస్వామిక విధానాన్ని వ్యతిరేకిస్తూ మీకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన కాలనీకి చెందిన ఓ మహిళా మాట్లాడుతూ... మాకు ఎవరి అండదండలు వద్దని, ఎవరి దయాదాక్షిణ్యాల మీద మేము బతకడం లేదన్నారు. వృద్ధ గిరిజన మహిళ మాట్లాడుతూ..మీరు మమ్మల్ని డబ్బులతో కొనే ప్రయత్నం చేస్తున్నారని, మా గ్రామంలో వీచే స్వచ్ఛమైన గాలి మీరు ఇవ్వగలరా? అని ప్రశ్నించారు. దీంతో, జూపూడి సభను ముగించారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ధనకోటేశ్వరరావు, టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, గ్రామ అధ్యక్షులు సీతారామిరెడ్డి, కరేడు గ్రామ నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాల తయారీ ముఠా అరెస్టు

- మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి -బద్వేలు (కడప జిల్లా)

నకిలీ పట్టాలు తయారు చేసే ముఠాను అరెస్టు చేసినట్లు మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కడప జిల్లా బద్వేలు అర్బన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ పట్టాలు తయారు చేసే ముఠాపై గోపవరం తహశీల్దార్ త్రిభువన్‌రెడ్డి తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. నకిలీ పట్టాలు తయారు చేసే దాసరి రత్నమ్మ, పొట్టిపాటి ప్రసాద్, జైపాల్, రామాంజనేయులు, ఓబులేసు, పిల్లి భాస్కర్, మన్యం బాబురావు, బత్తిన రవిశంకర్, చిన్న సుబ్బయ్య, షేక్ బాబ్జాన్, అన్నపురెడ్డి శ్రీనివాసులను అరెస్టు చేసి వారిపై బద్వేలు అర్బన్, రూరల్ పోలీసు స్టేషన్లలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వారి వద్దనుండి నకిలీ పాస్ పుస్తకాలు, ఇంటి పట్టాలు, రబ్బరు స్టాంపులు, కలర్ ప్రింటర్ స్టాంపులు తయారీ యంత్రంతో పాటు మరికొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంకా కొంతమందిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.

బ్రిటన్‌తో ఒప్పందం.. ప్రజారోగ్యానికి దెబ్బ

- అధిక కొవ్వు, చక్కెర ఉత్పత్తులపై సుంకాలు రద్దు

న్యూఢిల్లీ : బ్రిటన్‌తో ప్రధాని నరేంద్ర మోడి కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారతీయుల ప్రజారోగ్యాన్ని దెబ్బతీయనుందనే ఆందోళనలు నెలకొన్నాయి. ఈ ఒప్పందం బ్రిటన్ నుండి బిస్కెట్లు, చాక్లెట్లు, సాఫ్ట్ డ్రింక్స్ వంటి అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు (హెచ్ఎఫ్ఎస్ఎస్) ఉత్పత్తులను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది. దీనివల్ల ఈ ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. తక్కువ ధరలు, మార్కెటింగ్, ప్రకటనల ప్రచారాలతో ఈ ఉత్పత్తుల వినియోగం అమాంతం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇవి ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులను పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మెక్సికో గుణపాఠం..

మెక్సికో, అమెరికా, కెనడా మధ్య 1992లో నార్త్ అమెరికన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరిగింది. అనంతరం మెక్సికో బలమైన ప్రజారోగ్య రక్షణ చర్యలను అమలు చేయడంలో విఫలమైంది. దీంతో చౌకగా సాఫ్ట్ డ్రింక్స్, స్నాక్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్



దిగుమతులు భారీగా పెరిగాయి. హెచ్ఎఫ్ఎస్ఎస్ ఉత్పత్తుల వినియోగం పెరిగింది. ఫలితంగా మెక్సికోలో ఊబకాయం, మధుమేహం వంటి ఆహార, సంబంధిత వ్యాధులు విపరీతంగా పెరిగాయి. దీన్ని అధిగమించడానికి 2014లో మెక్సికో 'సోడా టాక్స్', ప్యాకెట్లపై హెచ్చరిక లేబుల్స్ వంటి కఠిన నియంత్రణలను ప్రవేశపెట్టింది. తద్వారా ఈ సమస్యను కొంత నియంత్రించగలిగింది. బ్రిటన్‌లో హెచ్ఎఫ్ఎస్ఎస్ ఉత్పత్తులపై కఠిన నియంత్రణలు అమల్లో ఉన్నాయి. అక్కడి అహార ఉత్పత్తుల ప్యాకింగ్‌లపై కొవ్వు, చక్కెర, ఉప్పు స్థాయిలను రంగుల ద్వారా సూచిస్తుంది. ఇది వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఎంపికలు చేసుకోవడానికి, అప్రమత్తంగా ఉండటానికి సహాయపడుతాయి.

భారత నియంత్రణ సంస్థలు విఫలం

మెక్సికో, యుకె తరహాలో భారత్‌లో ఇలాంటి నియంత్రణలు లేకపోవడం లేదా ఉన్నవి సమర్థవంతంగా అమలు కాకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఇక్కడ జంక్ ఫుడ్ ప్రకటనలపై ఎలాంటి బైండింగ్ ఆంక్షలు లేవు. పిల్లలను లక్ష్యంగా చేసుకునే చాకిలేట్ల వంటి ప్రకటనలపై నియంత్రణలు సమర్థవంతంగా అమలు కావడం లేదు. భారత్‌లో తప్పుదారి పట్టించే ప్రకటనలను గుర్తించడంలో లేదా శిక్షలు విధించడంలో నియంత్రణ సంస్థలు విఫలమవుతున్నాయి. బ్రిటన్ ఉత్పత్తుల దిగుమతి, వినియోగం పెరగడం వల్ల ప్రజారోగ్యానికి సవాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. యుకెలో ఉన్నట్లుగా బలమైన నియంత్రణలు, ప్యాకెట్లపై హెచ్చరిక సమాచారం, ప్రకటనలపై ఆంక్షలు, పన్నుల వంటి చర్యలు భారత్‌లోనూ అమలు చేయకపోతే, మెక్సికోలో చూసినట్లుగా ఆరోగ్య సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాకు రూ.4,541 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగ విత్త సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 1.8 శాతం వృద్ధితో రూ.4,541.3 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.4,458 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.29,628 కోట్ల మొత్తం ఆదాయాన్ని ప్రకటించగా.. గడిచిన క్యూ1లో 4.9 శాతం వృద్ధితో రూ.31,091 కోట్ల ఆదాయాన్ని సాధించింది. బిఒబి నికర వడ్డీ ఆదాయం 1.4 శాతం తగ్గి రూ.11,435 కోట్లుగా నమోదయ్యింది. స్థూల నిరర్థక ఆస్తులు 2.88 శాతం నుంచి 2.28 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పిఎలు 0.69 శాతం నుంచి 0.6 శాతానికి పరిమితమయ్యాయి.

ఎంజి నుంచి సైబర్‌స్టర్ ఇవి

- ధర రూ.74.90 లక్షలు

న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన సరికొత్త సైబర్‌స్టర్ ఇవి ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును ఆవిష్కరించింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.74.99 లక్షలుగా నిర్ణయించింది. ఇది 3.2 సెకన్లలోనే 1-100 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని పుంజుకోనుంది. 77 కిలోవాట్ బ్యాటరీ కలిగి ఉన్న ఈ కారును ఒక్క సారి ఛార్జింగ్ చేస్తే 580 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని ఆ కంపెనీ తెలిపింది. నాలుగు రంగుల్లో అందుబాటులోకి తెచ్చిన ఈ ఎస్‌యువి ఎంజి సెలెక్ట్ షోరూమ్‌లలో లభిస్తుందని పేర్కొంది.

గెలాక్సీ జడ్ ఫోల్డ్ 7 విక్రయాలు ప్రారంభం

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తన గెలాక్సీ జడ్7 సిరీస్ అమ్మకాలను ప్రారంభించినట్లు ఆ కంపెనీ తెలిపింది. తన ఏడవ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు అయిన గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 7ఎఫ్ఇ తో పాటు గెలాక్సీ వాచ్ 8 సిరీస్‌లను విక్రయిస్తున్నట్లు వెల్లడించింది. ఇవి రిటైల్ అవుట్‌లెట్లు సహా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

ఎఫ్‌టిఎతో భారత్‌కు ప్రయోజనమే

- ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా

న్యూఢిల్లీ : బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదుర్చుకోవడం ద్వారా భారత్‌కు ప్రయోజనమేనని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని తాను స్వాగతిస్తున్నానని చెప్పారు. బిఎఫ్ఎస్ఐ సమ్మిట్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఇరుదేశాలు చేసుకున్న ఈ ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థలోని బహుళ రంగాల అభివృద్ధికి దోహదం చేయనుందన్నారు. ఇతర దేశాలతోనూ భారత్ ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ అమెరికాతో సహా పలు దేశాలతో వాణిజ్య చర్చలు కొనసాగిస్తోందని మల్హోత్రా అన్నారు.



రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి

- మార్కెట్లకు రెండో రోజూ భారీ నష్టం

ముంబయి : భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న అనిశ్చితి దేశీయ స్టాక్ మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే వరుసగా రెండో రోజూ స్టాక్ మార్కెట్లు నష్టాలను చవి చూశాయి. శుక్రవారం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 721 పాయింట్లు లేదా 0.88 శాతం పతనమై 81,463కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 225 పాయింట్లు లేదా 0.9 శాతం కోల్పోయి 24,837కు పరిమితమయ్యింది. ఈ రెండు సెషన్లలో సెన్సెక్స్ 1264 పాయింట్లు పతనమయ్యింది. దీంతో దాదాపు రూ.10 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.461.43 లక్షల కోట్ల నుంచి రూ.451.68 లక్షల కోట్లకు పడిపోయింది. వారాంతం సెషన్‌లో స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 1 శాతం వరకు నష్టపోయాయి. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాలను చవి చూశాయి.

సంపాదకీయం

ఇదీ గ్రామ స్వరాజ్యం!

'భారత దేశం గ్రామాల్లో నివసిస్తుంది' అని మహాత్మా గాంధీ చెప్పారు. గ్రామ స్వరాజ్యం అన్నది జాతీయోద్యమ నినాదం. కానీ ఈనాడు రాష్ట్రంలోని స్థానిక సంస్థలపట్ల పాలకుల తీరు గాంధీజీ కన్న కలలను కల్లలు చేసేలా, జాతీయోద్యమ ఆకాంక్షలను మరుగునపర్చేలా ఉండడం బాధాకరం. అత్యధిక పంచాయతీలు తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటూ సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఉన్న నేపథ్యంలో కేంద్రం స్థానిక సంస్థల కోసం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేయడం దారుణం. 'స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా మార్చాలి. పంచాయతీలకు నేరుగా నిధులు, స్థానిక సంస్థలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక పటుత్వం అవసరం' అని ఈ ఏడాది పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఘంటాపథంగా చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆచరణలో ఇలా వ్యవహరించడం నోటితో నవ్వి నొసటితో వెక్కిరించడంలా ఉంది. గత వైసిపి ప్రభుత్వం అన్ని రకాల నిధులనూ వేరే వాటికి మళ్లించడాన్ని తప్పుబట్టిన టిడిపి కూటమి ఇప్పుడు అధికారంలో ఉండి అదే పని చేయడం ఏమిటన్నది జనం ప్రశ్న.

15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి 2024 డిసెంబరు రెండవ వారంలో రూ.1,121 కోట్లు విడుదల చేసినా ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు బదలాయించలేదు. ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం నిధులు విడుదల చేసిన పది పని దినాల్లో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు కేటాయించాలి. గడువు దాటితే, మార్కెట్ అప్పులకు చెల్లిస్తున్న విధంగా వడ్డీని చెల్లించాలి. ఇన్ని నిబంధనలున్నా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా స్థానిక సంస్థల నిధులు ఇతర అవసరాలకు మళ్లించడం అన్యాయం. స్థానిక సంస్థల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అన్‌టైడ్ గ్రాంటు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా కోసం టైడ్ గ్రాంటు వినియోగించాల్సి ఉంది. గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన తరుణంలోనూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక సంఘం రూ.2,099 కోట్లను రాష్ట్రానికి కేటాయించింది. మొదటి విడత సుమారు రూ.980 కోట్లు మరో రెండు నెలల్లో విడుదల కావాల్సి ఉంది. అయితే, గతేడాది కేటాయించిన నిధులు స్థానిక సంస్థలకు బదలాయించకపోవడంతో కేంద్రానికి వినియోగ ధృవపత్రాలు సమర్పించడం సాధ్యం కాదు. దీంతో ఆర్థిక సంఘం ఈ ఏడాది నిధుల విడుదలను నిలిపివేస్తోంది. కాబట్టి ప్రభుత్వ చర్యల కారణంగా స్థానిక సంస్థలు రెండు విధాలుగా నష్టపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నమాట. ఆర్థిక సంఘం నిధుల విడుదల చేయాలని కోరుతూ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు గత కొన్ని నెలలుగా సిఎం, డిప్యూటీ సిఎం, ఉన్నతాధికార్లకు వినతులు సమర్పించినా ఫలితం లేదు. రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులను వాటికి కేటాయించకుండా ఇతర అవసరాలకు వినియోగించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలను నిర్వీర్యం చేయడం తగదు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఆందోళన బాట పట్టక తప్పడం లేదు.

నిధుల సంగతి అలావుండగా వాటికి విధులు, అధికారాల బదలాయింపు కూడా హుళక్కే! రాజ్యాంగం 73,74 సవరణల గురించి పాలకులు గొప్పగా వల్లించడమేతప్ప ఆచరణ అంతంత మాత్రమే. ఇక షెడ్యూల్డు ప్రాంతాలకు సంబంధించిన పీసా చట్టాన్ని కూడా పాలకులు తుంగలో తొక్కుతున్నారు. గ్రామసభ అనుమతి లేనిదే షెడ్యూల్డు ప్రాంతాల్లో భూసేకరణతో సహా వివిధ పాలనాపరమైన చర్యలు చేపట్టడానికి వీల్లేదు. అయినప్పటికీ ఆ గ్రామ సభలనే సమావేశపర్చకుండా సర్కారు వారికి నచ్చిన సంపన్నులకు వందలు, వేల ఎకరాల ఏజెన్సీ ప్రాంత భూముల్ని అప్పనంగా కట్టబెడుతున్నారు. పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులు, మైనింగ్ తదితర పేర్లతో అదానీ, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ తదితర కార్పొరేట్ సంస్థలకు భూపందేరం చేస్తున్నారు. ఇటువంటి చర్యల మూలంగా ఆదివాసీలు తమ హక్కులను కోల్పోవడమేగాక వారి జీవనోపాధి కూడా తీవ్రంగా దెబ్బ తింటోంది. ఈ నేపథ్యంలోనే అడవి బిడ్డలు విల్లంబులతో సర్కారుకు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆందోళనలు ఉధృతం కాకముందే నిధుల విడుదల, ఆదివాసుల హక్కుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడం అవశ్యం.

మంచి మాట



దేవుడనేది మానవుడు కల్పించిన అబద్ధం. చాలా అబద్ధాల వలెనే గత కాలంలో అది కూడా కొంత వరకూ ప్రయోజనకరంగా వుండింది. కానీ, అన్ని అబద్ధాల వలెనే ఇది కూడా రానురాను జీవితాన్ని కల్మషం చేసింది. కనుక మావన సంఘంలో అవినీతి కడిగివేయబడి, నీతి పెరగాలంటే దైవ విశ్వాసం పోవాలి. పోక తప్పదు.

- గోరా,

ఆధునిక నాస్తికోద్యమ నిర్మాత.

జననం : 15.11.1902
మరణం : 26.7.1975

వ్యాఖ్య

'పరాయి' ముద్రతో వేట, వేధింపుల వెనుక ...



సరిహద్దుల ఆవలికి ఈ నిస్సహాయ ప్రజానీకాన్ని నెట్టివేసేందుకోసం అధికారులు చేసిన ప్రయత్నాలన్నీ అందుకు అవసరమైన ఆధార పత్రాలు చూపించడంలో ఎప్పటికప్పుడు విఫలమవుతూ వస్తున్నాయి. ఈ ప్రయత్నాల వెనుక అసలు ఉద్దేశమేమిటో కూడా అంతకంతకూ స్పష్టమవుతున్నది. వారిని వారి భూముల నుండి వెళ్లగొట్టాలి. తరచూ ఇందుకోసం బుల్డోజర్లు వినియోగించడం జరుగుతుంది. అలా తీసుకున్న భూములను కార్పొరేట్ భూ కబ్జాదార్లకు అప్పగించడమే జరుగుతుంది. ఉత్తరోత్తరా అదో భూ సంబంధమైన అవినీతి వ్యవహారాలకు దారితీస్తుంది. అంతేగాక ఈ ప్రచారం వల్ల రాష్ట్రంలోని బహు జాతులతో కూడిన వైవిధ్యభరిత ప్రజానీకంలో విభజన మరింత తీవ్రమవుతుంది. మరీ ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు రానున్న తరుణంలో.

గత కొంత కాలంగా దేశమంతటా భయాందోళనలు తాండవిస్తున్నాయి. భారీ సంఖ్యలో బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను బంగ్లా దేశీయులుగా ముద్ర వేయడం ఇందుకు కారణమవుతున్నది. బెంగాలీ మాట్లాడ్డం, ముస్లింలై వుండటం కలగలిపి ఒక ప్రమాదకరమైన లేబుల్ తగిలిస్తున్నారు. వారిని ఉన్నఫళానా అక్రమ బంగ్లాదేశీ చొరబాటుదారులుగా ముద్ర వేస్తున్నారు.

ఇది నిజంగానే ఒక తప్పుడు చిత్రణ. పౌరసత్వ సవరణ చట్టం రూపకల్పన వెనుక వున్నది ఇలాంటి తప్పుడు భావనే. ఈ ప్రచార కాండలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ముందు పీఠిన నిలిచారు. అస్సాం ప్రజలు సి.ఎ.ఎ పట్ల ఎలా స్పందించారో ఆయనకు తప్పక తెలిసి వుంటుంది. ఈ తరహా ప్రచారం సాగించే సందర్భంలో ఆయన ఈ అంశాన్ని అంతర్గర్భితంగా ప్రస్తావిస్తున్నారు. బెంగాలీ మాట్లాడే వారెవరైనా బంగ్లా దేశీయులను గుర్తించడానికి సహాయ పడతారని చెప్పేదాకా వెళ్లారు. అలా చెప్పడంలో అంతరార్థం ఏమిటంటే ఈ రెండింటి మధ్యనా విడదీయరాని ముడి వుందని సంకేతమివ్వడమే. రాజ్యాంగ విరుద్ధమైన ఈ వ్యాఖ్యపై తీవ్రాగ్రహం వ్యక్తం కావడంతో హిమంత ఒక విధంగా తప్పు ఒప్పుకోవలసి వచ్చింది: "సరే, వారంతా విదేశీయులే కానక్కరలేదని ఒప్పుకుందాం, అయితే అస్సామీలమైన మనం ప్రత్యేకించి హిందువులం మన గడ్డ మీద దిక్కులేని మైనారిటీలుగా అయిపోతున్నాం. కేవలం అరవై ఏళ్ల వ్యవధిలోనే ఇదంతా జరిగిపోయింది. మన సంస్కృతినీ, భూమినీ, దేవాలయాలను పోగొట్టుకున్నాం. చట్టం మనకు సహాయ పడిందేమీ లేదు. అందుకే మనం నిస్పృహతో వున్నాం. అది మనుగడ కోసమే తప్ప ప్రతీకారానికి కాదు."

భూముల పరాధీనం

అయితే ఈ నిస్పృహ వచనాలలో పిసరంతైనా పశ్చాత్తాపం లేదు. బెంగాలీ మాట్లాడే వలస కార్మికులందరూ బంగ్లా దేశీయులేనన్న అంచనాతో వారికి వ్యతిరేకంగా మాట్లాడ్డం బూటకమే. సరిహద్దుల ఆవలికి ఈ నిస్సహాయ ప్రజానీకాన్ని నెట్టివేసేందుకోసం అధికారులు చేసిన ప్రయత్నాలన్నీ అందుకు అవసరమైన ఆధార పత్రాలు చూపించడంలో ఎప్పటికప్పుడు విఫలమవుతూ వస్తున్నాయి. ఈ ప్రయత్నాల వెనుక అసలు ఉద్దేశమేమిటో కూడా అంతకంతకూ స్పష్టమవుతున్నది. వారిని వారి భూముల నుండి వెళ్లగొట్టాలి. తరచూ ఇందుకోసం బుల్డోజర్లు వినియోగించడం జరుగుతుంది. అలా తీసుకున్న భూములను కార్పొరేట్ భూ కబ్జాదార్లకు అప్పగించడమే జరుగుతుంది. ఉత్తరోత్తరా అదో భూ సంబంధమైన అవినీతి వ్యవహారాలకు దారితీస్తుంది. అంతేగాక ఈ ప్రచారం వల్ల రాష్ట్రంలోని బహు జాతులతో కూడిన వైవిధ్యభరిత ప్రజానీకంలో విభజన మరింత తీవ్రమవుతుంది. మరీ ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు రానున్న తరుణంలో. అంతిమంగా ఈ వివాదాలు రాష్ట్ర ప్రభుత్వ విస్తృత వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి దోహదం చేస్తాయి.

చారిత్రిక వాస్తవాలేంటి?

1971 తర్వాత బంగ్లాదేశ్ నుంచి అస్సాంలోకి వలసలు కొనసాగిన మాట కాదనలేనిదే కానీ అక్రమ వలసదారులు మిడతల దండులా వచ్చి రాష్ట్రాన్ని ఆక్రమించేస్తున్నారనే భయాందోళనలు మాత్రం బూటకమైనవి. వాస్తవ విరుద్ధం. అఖిల భారత స్థాయిలో జనాభా పెరుగుదలకు భిన్నంగా అస్సాంలో గత కొన్ని సంవత్సరాల్లో జనాభా పెరుగుదల తగ్గుముఖంలో వుంది. అక్రమ వలసదారులు ముంచెత్తుతున్నారనే పాట మాత్రం ముదిరిపోయినట్టు కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో ముస్లిం జనాభా పెరిగిపోతున్నదనే భయాందోళన సృష్టించడమే ఇందుకు చాలావరకూ కారణం.

జనాభా విషయాల అధ్యయనాలు కూడా వలసవాద పాలనలో తిరుగులేని విధంగా అస్సాం జనాభా పొందిక మారిందని నిర్ధారణగా చెప్పాయి. తూర్పు బెంగాల్ నుంచి నిరంతరాయంగా వలసలు జరగడమే ఇందుకు కారణమైంది. 1901-1941 మధ్య ఒక క్రమ పద్ధతిలో వలస ప్రభుత్వం ఈ వలసలను ప్రోత్సహించడం వల్ల ఈ ప్రాంతంలో జనాభా పొందిక స్వరూపం మారిపోయింది. ఎన్నికల సంఘం నొక్కి చెబుతున్న మాటలు నమ్మేట్టయితే ఒక ప్రశ్న సహజంగానే వచ్చేస్తుంది. దేశ విభజనకు ముందు అస్సాంలో స్థిరపడిన లక్షలాది మంది తూర్పు బెంగాల్ ముస్లిం వలస రైతుల వారసులు ఎక్కడ స్థిరపడ్డారు?

ఫేక్ కథలు, ఘోర జ్ఞాపకాలు

కనుక హిమంత అదేపనిగా చేస్తున్న నిర్ధారణలు జాతి పరమైన, మత పరమైన కథనాలకు అనుగుణంగానే సాగుతున్నాయి. కానీ జనాభా వివరాలు భిన్నమైన సత్యాలు చెబుతున్నాయి: 1991-2001కీ 2001-2011కీ మధ్య దశాబ్దాలలో బంగ్లాదేశీ వలసదార్ల సంఖ్య 2.79 లక్షల నుంచి 1.72 లక్షలకు తగ్గిపోయింది. అంటే దాదాపు సగానికి సగం పడిపోయిందన్న మాట. అయితే ఈ ఫేక్ న్యూస్, వైరల్ వాట్సప్ ఫార్వర్డ్‌ల కాలంలో నిజమైన లెక్కలు ఎవరికి కావాలి?

ఈ ధోరణి కేవలం అస్సాంకే పరిమితం కాదు. దేశంలోని విస్తార ప్రాంతాల్లో ప్రత్యేకించి బిజెపి పాలించే రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ముస్లింలందరూ బంగ్లాదేశ్ అక్రమ వసలదారులనే ప్రచారం భారీగా సాగుతున్నది. అధికార పత్రాలను ఏ మాత్రం పరీక్షించకుండానే ప్రజలను వేధింపులకు గురి చేస్తున్నారు. అనేకసార్లు హింస పెడుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ముస్లింల సంఖ్య సుమారు 2.47 కోట్లు వుంటుంది. మొత్తం 9.13 కోట్ల రాష్ట్ర జనాభాలో ఇది 27.01 శాతం, ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్న ప్రస్తుత నేపథ్యంలో వారిలో అనేకులు పనికోసం రాష్ట్ర సరిహద్దులు దాటి బయటకు పోవడం సహజమే. ఆ విధంగా రాష్ట్రాంతర వలసలో చెప్పుకోదగిన భాగంగా వుండొచ్చు.

పౌరసత్వాన్ని నిర్ధారించే ఏకాంశ అధికార పత్రంతో కాకుండా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు ఎపిక్ వంటి వాటన్నిటినీ తోసిపారేసేట్టయితే ఈ శ్రామికులు ఎంత దారుణంగా దెబ్బ తింటారనేది ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరం లేదు. వారు ఎంత ప్రమాదకర పరిస్థితిలో వున్నదీ కోవిడ్-19 తరుణంలోనే నగ్నంగా వెల్లడైంది. వలస కార్మికులు వందల కిలోమీటర్లు నడిచిపోవడం. ఒక తల్లి బిడ్డను సూట్‌కేస్ మీద కూర్చోబెట్టి చక్రాలతో తోసుకుంటూ పోవడం, నడిచే రైలు కిందపడి చితికిపోయి చెల్లాచెదురైన వలస కార్మికుల దేహ ఖండాలు ఇంకా మనందరి మస్తిష్కంలో వెంటాడుతూనే వున్నాయి.

వ్యవస్థ లక్షణమే

ప్రపంచీకృత పెట్టుబడిదారీ వ్యవస్థలో వలస కార్మికులనేవారు ఒక అవిభాజ్య భాగంగా వుంటారనేది తెలియడానికి ఎవరూ చరిత్ర లోతుల్లోకి పోవలసిన అవసరం లేదు. పెట్టుబడిదారీ విధానం వలసలు, అర్థ వలసల నుంచి ఆర్థికంగా బలహీనంగా వున్న ప్రాంతాల నుంచి తెచ్చిన శ్రామికులపైనే ఆధారపడి పెరిగింది. 19వ శతాబ్ది ద్వితీయార్థంలో టీ, కాఫీ, చెరకు, రబ్బరు తోటలు పెరిగాయి. రైల్వేలు, టెలిగ్రాఫ్ లైన్లు, నవీన గనుల తవ్వకాల ప్రారంభం వంటివన్నీ పెద్ద ఎత్తున జరిగింది అలాగే. శ్రామిక బలగాల చలనశీలత అటూ ఇటూ తరలిపోవడం కూడా అంతకు ముందెన్నడూ లేని స్థాయిలో సాగింది. ఉత్తరోత్తరా రాజ్యాలు వలసల క్రమబద్ధీకరణ, నిర్వహణకు వ్యవస్థలను పెంపొందించాయి. ఆ అంశానికున్న రాజకీయ ఆర్థిక ప్రాధాన్యతను గుర్తించాయి.

21వ శతాబ్దంలో ద్రవ్య పెట్టుబడితో నడిచే ప్రపంచీకరణ, ఘర్షణల కారణంగా కలిగే నిర్వాసం, దేశాంతర శ్రామిక ప్రవాహాలతో వలసలు సరికొత్త తక్షణాంశాలుగా తయారైనాయి. అయినా సరే దాంతోపాటే అభివృద్ధి నిరోధక మితవాద భావజాలాలు కూడా పెరిగిపోయాయి. అస్తిత్వ ఆధారిత సమీకరణలను సృష్టించడానికి ఇది వారికి వాటమైన ఆయుధంగా తయారైంది.

ట్రంప్ టు ఆర్‌ఎస్‌ఎస్

"ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వలస కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారు. 2022లో మొత్తం ప్రపంచ శ్రామిక బలగంలో వీరు 4.7 శాతంగా వున్నారు. వారిలో అత్యధికులు అధికాదాయ దేశాలలో సర్వీసు రంగం వంటి వాటిలో ఉద్యోగాలలో వుంటున్నారు. వాటిలో తగు సదుపాయాలు కల్పించేవే" అని 2024 అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నివేదిక నొక్కి చెబుతున్నప్పటికీ ఈ ఆర్థిక వాస్తవాలను తోసిపుచ్చే రాజకీయ తొక్కిసలాట మనం చూస్తున్నాం. 'పక్కన పెట్టడం, పరాయివాళ్లను చేయడం' అనే ఈ దుందుడుకు ధోరణికి డోనాల్డ్ ట్రంప్ విధానాలు ప్రతిరూపాలుగా వున్నాయి. వలసలనూ వలస కార్మికులను నేరస్తులుగా చూపే ఈ ధోరణిని మనం సుస్పష్టంగా తిరస్కరించాలి.

ఈ అంతర్జాతీయ పరిణామాల మధ్య భారతదేశాన్ని విడదీసి చూడలేము. బలీయమైన కార్పొరేట్ మతతత్వ కూటమికి ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ భావజాలం కేంద్రంగా వున్న పరిస్థితిలో బెంగాలీ మాట్లాడే శ్రామిక ప్రజలపై దాడులు జరిగితీరతాయి. ప్రస్తుతమున్న ఈ ప్రభుత్వం జాతి, భాష, సాంస్కృతిక వైవిధ్యాలకు వ్యతిరేకమైంది. మనందరం కలిసి కట్టుగా సాగించిన సామ్రాజ్యవాద వ్యతిరేక స్వాతంత్ర్య పోరాట క్రమంలో రూపొందిన భారత దేశ భావన గుండెకాయ పైనే ఆ విధంగా అది వేటు వేస్తుంది.

హక్కులనూ మానవత్వాన్ని దెబ్బ తీసే ఈ దాడిపై ఏ ఒక్క తరగతికి చెందిన ప్రజలు మాత్రమే ప్రతిఘటించడం సాధ్యమయ్యేది కాదు. మనం అంటే ప్రజలమైన మనం ఏక తాటిపై నిలిచి పోరాడాలి.

బలీయమైన కార్పొరేట్ మతతత్వ కూటమికి ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ భావజాలం కేంద్రంగా వున్న పరిస్థితిలో బెంగాలీ మాట్లాడే శ్రామిక ప్రజలపై దాడులు జరిగితీరతాయి. ప్రస్తుతమున్న ఈ ప్రభుత్వం జాతి, భాష, సాంస్కృతిక వైవిధ్యాలకు వ్యతిరేకమైంది. మనందరం కలిసి కట్టుగా సాగించిన సామ్రాజ్యవాద వ్యతిరేక స్వాతంత్ర్య పోరాట క్రమంలో రూపొందిన భారత దేశభావన గుండెకాయ పైనే ఆ విధంగా అది వేటు వేస్తుంది. హక్కులనూ మానవత్వాన్ని దెబ్బ తీసే ఈ దాడిపై ఏ ఒక్క తరగతికి చెందిన ప్రజలు మాత్రమే ప్రతిఘటించడం సాధ్యమయ్యేది కాదు. మనం అంటే ప్రజలమైన మనం ఏక తాటిపై నిలిచి పోరాడాలి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

(జులై 21-27 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సమీక్ష

విద్వేష వీరమల్లు

- వి. ఆర్

గత కొంత కాలంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతున్న మాటలను, అనుసరిస్తున్న విధానాలను గమనిస్తున్న వారు ఊహించినట్లుగానే ఈ చిత్రం చారిత్రాత్మకం కాదు, మత విద్వేషాగ్నుల వ్యాప్తిలో భాగమని తేలిపోయింది. తన అభిమానులకన్నా తెలుగు ప్రేక్షకులకన్నా ప్రస్తుతం తాను ఆరాధిస్తున్న ఆర్.ఎస్.ఎస్ ను ప్రసన్నం చేసుకోవడానికే ఈ సినిమాలో నటించారా అనే అనుమానాన్ని కలిగించింది. తెలుగు రాష్ట్రాల యువతలో క్రేజ్ వున్న పవన్ కల్యాణ్ బిజెపి నాయకుల చెలిమితో మత విద్వేషకారుడుగా దిగజారిపోవడం మాత్రం విషాదకరం, భవిష్యత్తుకు ప్రమాదకరం. చరిత్రలోని స్థలాలు, కొందరు వ్యక్తుల పేర్లతో కల్పితమైన సంఘటనలను మతం కోణంలో చూపడం వెనుక రాజకీయ ఎజెండా వుంది.



పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' హిట్టా, ఫట్టా అన్నది కాదు. బాధ్యతాయుత స్థానంలో వున్న వ్యక్తి ఏ సందేశం ఇచ్చారన్నది ముఖ్యం. సందేశాత్మక, కుటుంబ చిత్రాల నిలయంగా భాసిల్లిన తెలుగు చిత్ర పరిశ్రమలో ఇలాంటి ప్రమాదకర చిత్రం రావడం, అందులో ఉప ముఖ్యమంత్రి స్థానంలో వున్న వ్యక్తి నటించడం రానున్న ప్రమాద ఘంటికలకు సంకేతం. విద్వేషాగ్నులు రగిలించే ఈ సినిమాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు, కాంగ్రెస్ ఏలుబడిలో వున్న తెలంగాణలో కూడా టికెట్ల ధరలు పెంచుకోవడానికి అనుమతులు ఇవ్వడంలో అంతుచిక్కని ఆంతర్యం ఏమిటో?

ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించిన 'హరి హర వీరమల్లు' సినిమా అనేక వాయిదాలు పడుతూ ఎట్టకేలకు గురువారం విడుదలైంది. ఆయన అభిమానుల్లో జోష్ పెంచినట్లు లేదు. గత కొంత కాలంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతున్న మాటలను, అనుసరిస్తున్న విధానాలను గమనిస్తున్న వారు ఊహించినట్లుగానే ఈ చిత్రం చారిత్రాత్మకం కాదు, మత విద్వేషాగ్నుల వ్యాప్తిలో భాగమని తేలిపోయింది. తన అభిమానులకన్నా తెలుగు ప్రేక్షకులకన్నా ప్రస్తుతం తాను ఆరాధిస్తున్న ఆర్.ఎస్.ఎస్ ను ప్రసన్నం చేసుకోవడానికే ఈ సినిమాలో నటించారా అనే అనుమానాన్ని కలిగించింది. తెలుగు రాష్ట్రాల యువతలో క్రేజ్ వున్న పవన్ కల్యాణ్ బిజెపి నాయకుల చెలిమితో మత విద్వేషకారుడుగా దిగజారిపోవడం మాత్రం విషాదకరం, భవిష్యత్తుకు ప్రమాదకరం. చరిత్రలోని స్థలాలు, కొందరు వ్యక్తుల పేర్లతో కల్పితమైన సంఘటనలను మతం కోణంలో చూపడం వెనుక రాజకీయ ఎజెండా వుంది.

అధికారం కోసం కాదు మార్పు కోసం రాజకీయాల్లోకి వచ్చానని, ప్రశ్నించడం తన సిద్ధాంతమని చెప్పుకున్న పవన్ కల్యాణ్ గత కొంతకాలంగా తానే ప్రశ్నగా మారిపోతున్నారు. తాను గతంలో మాట్లాడిన మాటలకు తానే జవాబు చెప్పుకోవలసిన స్థితికి చేరుకున్నారు. ఆయనలో గందరగోళం కేవలం వ్యక్తిగతమే అయితే చర్చ అక్కర్లేదు. కానీ ఆయన రెండు రకాలుగా సమాజాన్ని, ముఖ్యంగా యువతను ప్రభావితం చేసే స్థానాల్లో వున్నారు. ఒకటి ఆయన ప్రముఖ సినీనటుడు, రెండు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి. ఆయన చేసే నటన, చెప్పే మాట, తీసుకునే ప్రతి నిర్ణయం సమాజంపై ప్రభావాన్ని కలిగిస్తుంది. అలాంటి వ్యక్తి మరింత బాధ్యతాయుతంగా వుండాలి. అలా వుండాలని ఆయన అభిమానులు కోరుకుంటారు. అందుకే కుల, మత, ప్రాంత, లింగ బేధాలకు అతీతంగా తల్లిదండ్రుల కంటే, బిడ్డల కంటే సినిమా హీరోలనే ఎక్కువగా అభిమానిస్తారు. తమ కష్టార్జితాన్ని ధారపోస్తారు. ఇలాంటి అభిమానులే పవన్ కల్యాణ్ లాంటి వారి ఉన్నతికి పునాదిరాళ్ళు. అలాంటి పునాదులను ఎవరి మెప్పు కోసమో పెకలించుకోవడం విజ్ఞత కాదు.

వీరమల్లు సినిమా కథ

నదిలో కొట్టుకుంటూ వచ్చిన ఒక పిల్లాడిని ఒక కుటుంబం పెంచుకుంటుంది. మన రాష్ట్రంలోని పూర్వపు గుంటూరు జిల్లా, ప్రస్తుత పల్నాడు జిల్లా, బెల్లంకొండ మండలం కోళ్లూరు ప్రాంతాల్లో పెరిగిన ఈ పిల్లాడు దొంగతనంలో ఆరితేరతాడు. ఈ ప్రాంతాన్ని ఒక చిన్న రాజు పాలిస్తుంటాడు. ఇక్కడ వజ్రాలు వున్నాయని బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ అధికారులు అన్వేషణ చేయిస్తుంటారు. ఇక్కడ దొరికిన ఒక వజ్రాన్ని బ్రిటీష్ అధికారుల కన్నుగప్పి అతి చాకచక్యంగా దొంగిలించి తన రాజుకు ఈ పిల్లాడు చేరుస్తాడు. ఆ వజ్రం, ఆ వజ్రాన్ని దొంగిలించిన వాడి గురించి అలా అలా తిరిగి గోల్కొండ నవాబు దర్బారుకు చేరుతుంది. ఔరంగజేబు దగ్గర వున్న కోహినూర్ వజ్రాన్ని దొంగిలించి తెచ్చే బాధ్యత ఈ దొంగకు గోల్కొండ నవాబు అప్పగిస్తాడు. హైదరాబాద్ నుండి ఎర్రకోట పైకి తన మంది మార్బలంతో ఈ దొంగ వెళ్లే క్రమంలో ఔరంగజేబు హిందువులపై అనేక రకాల పన్నులు వేసి, చిత్రహింసలకు గురిచేసి, మత మార్పిళ్లకు పాల్పడుతున్న సంఘటనలు చూసి వాటిని ఈ దొంగ హీరో ప్రతిఘటించడం ఈ చిత్ర ప్రధాన కథ.

చరిత్ర ఏం చెబుతుంది?

కోళ్లూరు ప్రాంతంలో బ్రిటీష్ వారు చేసిన వజ్రాల పరిశోధనలో గనులలో పెద్ద వజ్రం బయటపడినట్లు చరిత్ర చెబుతుంది. దాని బరువు గురించి అనేక వాదనలు వున్నా స్థూలంగా 186 పాత క్యారెట్లు లేదా 38.2 గ్రాములు వున్నట్లు చరిత్రకారులు నిర్ధారించారు. ఈ వజ్రాన్ని మొదట ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత 1626లో బాబర్ వశమై 'బాబర్ వజ్రం'గా పేరు పొంది మొఘల్ ఆస్థానంలోకి చేరింది. మొఘల్ సామ్రాజ్య పతనావస్థలో దండయాత్రకు వచ్చిన నాదిర్ షా ఈ వజ్రాన్ని సొంతం చేసుకోవాలని ఎన్నో కుట్రలు పన్ని మహమ్మద్ షా నుండి దక్కించుకుని కోహ్-ఇ-నూర్ (కాంతి శిఖరం) అని అభివర్ణించాడు. దానికి ఆ పేరే స్థిరపడిపోయింది. ఇలా అనేక చేతులు మారి చివరికి బ్రిటన్ ఎలిజబెత్ రాణి కిరీటంలోకి చేరింది. అత్యంత కాంతివంతమైన కోహినూర్ వజ్రాన్ని తిరిగి మన దేశానికి ఇవ్వాలని 1947, 1953 సంవత్సరాలలో భారత ప్రభుత్వం బ్రిటన్‌కు విజ్ఞప్తి చేసినా ఇవ్వడానికి ఆ దేశ పాలకులు అంగీకరించలేదు. ఇప్పటికీ అక్కడే వుండిపోయింది.

గత పదకొండు సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ఈ కోహినూర్ వజ్రం గురించి ఒక్కమాట మాట్లాడలేదు. వారికి మద్దతు ఇస్తున్న పవన్ కళ్యాణ్ ఎన్నడూ మాట్లాడలేదు. ఈ చిత్రంలో ఆ బ్రిటీష్ సామ్రాజ్యవాదం గురించి చూపలేదు (రెండవ భాగంలో వుందంటారేమో). వినోదం, విజ్ఞానానికి ఉపయోగ పడాల్సిన సినిమాలను ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాల్లో మత విద్వేషాలకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఉపయోగించుకుంటున్నాయి. కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ, శంభాజీ, ఝాన్సీ, ఛావా లాంటి సినిమాలను ఈ లక్ష్యంతోనే తీశారు. ఇదే తరహాలో ఇటీవల తెలంగాణలో 'రజాకార్' వచ్చింది. ఇప్పుడు మన రాష్ట్రంలోకి 'హరి హర వీరమల్లు' రూపంలో ప్రవేశించింది. ఈ సంవత్సరం మార్చి నెలలో విడుదలైన 'ఛావా' సినిమా మహారాష్ట్ర లోని ఖుల్దాబాద్‌లో మత అల్లర్లకు కారణమైంది. ఆ వెంటనే స్థానిక బిజెపి ఎంపీ ఉదయన్ రాజ్ భోంస్లే ఆ ప్రాంతంలో ఉన్న ఔరంగజేబు సమాధిని ధ్వంసం చేయాలని డిమాండ్ చేశాడు. రాజకీయ ఎజెండాలో భాగమే ఈ తరహా సినిమాలు అనడానికి ఇంతకన్న సాక్ష్యం అక్కర్లేదు. ఇవన్నీ పవన్ కల్యాణ్‌కు తెలియవని అనుకోగలమా?

అభ్యుదయ తెలుగు చిత్రసీమ

తెలుగు ప్రజల చరిత్రలో మన చిత్రసీమ అద్భుతమైన పాత్ర పోషించింది. 'భక్త ప్రహ్లాద'తో ప్రారంభమైన తెలుగు చిత్రాలు మొదటి పది సంవత్సరాలు పౌరాణిక కథల ఆధారంగానే వచ్చాయి. 1938-39 నాటికి గూడవల్లి రామబ్రహ్మం 'మాలపిల్ల' సినిమాతో అభ్యుదయ భావాలను చిత్రాల్లో పలికించడం ప్రారంభించారు. ఆ దశాబ్దం చివరిలో వచ్చిన 'వందేమాతరం', 'రైతు బిడ్డ', 'వర విక్రయం' లాంటి సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రజలు పట్టం కట్టారు. 1940-50 మధ్య 'భక్త పోతన', 'యోగి వేమన', 'త్యాగయ్య', 'పల్నాటి యుద్ధం'. 'బాలనాగమ్మ కథ' 'కన్యాశుల్కం' లాంటి అనేక చిత్రాలు ప్రజల జీవితాలతో ముడివేసుకు పోయాయి, పండిత పామరులను మెప్పించాయి. ఆ తర్వాతి కాలంలో ప్రజానాట్య మండలి నుండి వచ్చిన డాక్టర్ రాజారావు 'పుట్టిల్లు'తో సినీ రంగ నడకను ఉరకలెత్తించారు. 'రోజులు మారాయి', 'పెద్ద మనుషులు', 'జయభేరి' లాంటి సినిమాలు తెలుగు నాట అభ్యుదయ భావాలను పెద్ద ఎత్తున వ్యాపింపచేశాయి. ఆ తర్వాతి కాలంలో అనేక పరిణామాలు చెంది దొంగ, ఖైదీ, రాక్షసుడు, పోకిరి, పోరంబోకు, గుడుంబా శంకర్, ఇడియట్ లాంటి పేర్లతో చిత్రాలు వచ్చాయి. ఈ క్రమంలో వచ్చిన 'హరి హర వీరమల్లు' సినిమా మతతత్వ భావజాలానికి పునాది వేయడానికి ప్రయత్నించింది.

గత సంవత్సరన్నర కాలంగా పవన్ కల్యాణ్ ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను భుజాన వేసుకున్నారు. స్వయం ప్రకటిత సనాతన ధర్మ పరిరక్షకుడు అయ్యారు. తిరుపతి లడ్డుతో మొదలు పహల్గాం ఉగ్రవాద సంఘటన వరకు ప్రతిదీ మత కోణంలో మాట్లాడుతున్నారు. ఇంతకంటే గట్టిగా మతోన్మాద భావజాలాన్ని మాట్లాడిన తాజా మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కాశ్మీర్ పూర్వ గవర్నర్ సత్యపాల్ మాలిక్, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి ఒకరేమిటి ఇలా అనేకమంది నాగపూర్ మూల విరాట్‌ల చేతిలో కరివేపాకు లేదంటే తమలపాకులుగా మారిపోయిన విషయాన్ని పవన్ కల్యాణ్ గుర్తించడంలేదు. చైతన్యానికి ప్రతీకలైన ఆంధ్రప్రదేశ్ రచయితలు, కళాకారులు, అభ్యుదయ, ప్రజాతంత్ర వాదులు సాంస్కృతిక రంగంలోకి జొరబడుతున్న మత విద్వేషాలను ఆదిలోనే ప్రతిఘటించాలి. అందుకు వారి కలాలు, గళాలు, కళలు ఉపయోగించాలి. ★

ఆ పెన్షన్‌తో బతికేదెలా?

ఇ.పి.యస్-95 కింద మొత్తం పెన్షనర్ల సంఖ్య 78 లక్షలు. కాగా, వీరిలో 36 లక్షల మంది రూ.1000 కన్నా తక్కువ పెన్షన్ పొందుతున్నారు. 2014లో అప్పటి కేంద్ర ప్రభుత్వం కనీస పెన్షన్‌ను రూ.1000 చేసింది. కనీస పెన్షన్ వెయ్యి రూపాయ లంటే, ఎవరికైనా కనీసం వెయ్యి రూపాయలు పెన్షన్ వస్తుందనుకుంటాం. దీనిలో ఒక మతలబు ఉంది. కనీస పెన్షన్ వెయ్యి రూపాయలే అయినా 36 లక్షల మందికి వెయ్యి రూపాయల లోపు పెన్షన్ వస్తుంది. 13 లక్షల మందికి రూ.700 లోపు పెన్షన్ వస్తుంది. 500 రూపాయల పెన్షన్ వచ్చే వాళ్ళూ ఉన్నారు. గౌరవ ప్రదంగా బతికేందుకు ఈ ఐదు వందల రూపాయలు ఏ మూలకు సరిపోతాయి? గత ఏడు సంవత్సరాలుగా కనీస పెన్షన్ రూ.7500 చేస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. కేంద్ర మంత్రివర్గ సమావేశం, భవిష్య నిధి ట్రస్ట్ సమావేశం జరిగినప్పుడల్లా కనీస పెన్షన్ పెంచుతారని లక్షల మంది రిటైర్డ్ ఉద్యోగులు ఆశగా ఎదురు చూడటం తప్ప వాస్తవంలో కనీస పెన్షన్ పెంచే సూచనలు కనిపించడం లేదు.

- దాసం వెంకటరెడ్డి,
బెంగళూరు.

ఆ దశలో పోస్కో నేరంగా పరిగణించొద్దు : అమికస్ క్యూరీ సలహా

న్యూఢిల్లీ : కౌమార దశలో 16 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువతీ యువకుల మధ్య ఇష్టపూర్వక లైంగిక చర్యను పోస్కో చట్టం కింద నేరంగా పరిగణించవద్దని సుప్రీంకోర్టు అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు న్యాయస్థానానికి సలహా ఇచ్చారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో లిఖితపూర్వక నివేదికను సమర్పించారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం – 2012 (పోస్కో) 16 నుంచి 18 ఏళ్ల మధ్య యువతీ యువకుల లైంగిక చర్యను నేరంగా పరిగణిస్తుంది. 2012లో న్యాయవాది నిపుణ్ సక్సేనా దాఖలు చేసిన పిటిషన్ నేపథ్యంలో మన దేశంలో మొదటి మహిళా అదనపు సొలిసిటర్ జనరల్, సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్‌ను అమికస్ క్యూరీగా సుప్రీంకోర్టు నియమించింది. ఆమెకు న్యాయవాదులు పరాస్‌నాథ్‌సింగ్, ఎస్ షేర్వానీ, రోహిన్ భట్, ఆర్ సిన్హా సహకరించారు. పోస్కోలోని సెక్షన్ 2 (డి)లో చైల్డ్ అన్న పదంలో ఏకాభిప్రాయంతో లైంగిక చర్యలో పాల్గొనే 16 నుంచి 18 ఏళ్ల వయసు వారిని చేర్చకూడదని నివేదిక పేర్కొంది.

రాజస్థాన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే...

- విద్యార్థుల మృతితో విషాదంలో తల్లిదండ్రులు
- బలిపశువులైన ఉపాధ్యాయులు
- ఐదుగురిని సస్పెండ్ చేసిన ప్రభుత్వం


విద్యార్థులను కాపాడుతున్న స్థానికులు

జైపూర్ : రాజస్థాన్‌లోని బిజెపి సర్కారు నిర్లక్ష్యమే తమ పిల్లల ప్రాణాలను బలిగొందని పలువురు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. రాజస్థాన్‌లోని ఝలావర్ జిల్లా పిప్లోడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్న భవనం కప్పు కూలడంతో ఏడుగురు విద్యార్థులు చనిపోగా, 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగానే పాఠశాల భవనం కూలిపోయిందని అధికారులు చెబుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం కూలిపోయే స్థితిలో ఉందని ఏడాది కాలంగా తహసీల్దార్, సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్‌లకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలనా నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికుడు బాలకిషన్ మీడియాకు తెలిపారు. పాఠశాల భవనం నిర్మాణం సక్రమంగా లేదని, భవనం గోడలపై మొక్కలు మొలిచాయని, గోడల నుంచి నిరంతరం నీరుకారేదని విద్యార్థులు చెప్పారు.

ఐదుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం ఈ ప్రమాదానికి ఉపాధ్యాయులనే బలిపశువులను చేయాలన్ని చూస్తోంది. ఐదుగురు ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర విద్యామంత్రి మదన్ దిలావర్ ప్రకటించారు. ఈ సంఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజేకు పట్టున్న ఈ జిల్లాలో ఇటీవల ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో బికనీర్‌లో నీటిట్యాంక్ కూలిపోవడంతో ముగ్గురు చిన్నారులు మరణించారు. తరువాత బార్మర్‌లోని చోహ్టన్ బ్లాక్‌లో పాఠశాల గోడకూలి ఒక విద్యార్థి మరణించాడు.

థాయిలాండ్, కంబోడియాల మధ్య కొనసాగుతున్న దాడులు

- పెరుగుతున్న మృతుల సంఖ్య
- ఆందోళన వ్యక్తం చేసిన ప్రపంచ దేశాలు

బ్యాంకాక్ : థాయిలాండ్, కంబోడియాల మధ్యన దాడులు శుక్రవారం తీవ్రమయ్యాయి. ఘర్షణల కారణంగా 13 మంది సాధారణ పౌరులు, ఒక సైనికుడు మృతి చెందారని థాయ్ ప్రభుత్వం ప్రకటించింది. రెండు దేశాలు భారీ ఆయుధాలతో పరస్పరం దాడులకు తెగబడ్డాయి. దీంతో సరిహద్దు ప్రాంతాలు మరింత ఉద్రిక్తతగా మారాయి. ఈ పరిస్థితిపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమయింది. ఇరు దేశాలు తక్షణం కాల్పుల విరమణ పాటించాలని పలు దేశాలు కోరుతున్నాయి. కంబోడియా దళాలు ఆర్టిలరీ, అత్యాధునిక రష్యా తయారీ బిఎం-26 రాకెట్‌లతో విరుచుకుపడుతుందని థాయ్ సైన్యం ప్రకటించింది. తమ సైనిక దళాలు కంబోడియా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఎఫ్-16 యుద్ధ విమానాలతో దాడి చేశాయని, ఘర్షణ ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించామని థాయ్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రిచా సుక్సువాసన్ తెలిపారు. అయితే కంబోడియా ప్రభుత్వం తమ వైపు జరిగిన నష్టాన్ని అధికారికంగా ప్రకటించలేదు. సరిహద్దు వివాదం కారణంగా ప్రారంభమైన దాడులు భీకర యుద్ధంగా మారితే పరిస్థితులు మరింత దిగజారిపో తాయని. శాంతియుత పరిష్కారానికి తమ దేశం కృషి చేస్తుందని మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపారు. థాయిలాండ్, కంబోడియాల నాయకులు శాంతి చర్చలు జరిపి యుద్ధానికి త్వరగా ముగింపు పలకాలని ఆసియన్ సభ్య దేశాలు కోరుతున్నాయి.

భారత రాయబార కార్యాలయం హెచ్చరిక :

థాయిలాండ్, కంబోడియాల మధ్య నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో థాయిలోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉద్రిక్త వాతావరణం కారణంగా భారతీయులు ఏడు ప్రాంతాలకు ప్రయాణించొద్దని హెచ్చరించింది. థాయిలాండ్‌కు వచ్చె పర్యాటకులు ప్రభుత్వ అధికార వెబ్‌సైట్స్ నుండి మాత్రమే సమాచారాన్ని తెలుసుకోవాలని భారత రాయబార కార్యాలయం ఎక్స్‌లో పేర్కొంది.

జీరో పావర్టీకి 3 విధానాలు

(మొదటిపేజీ తరువాయి)

వివరాలను ఎప్పటికప్పుడు గ్రామ వార్డు సచివాలయాల్లో నమోదు చేయాలని సూచించారు.

తాను కూడా మార్గదర్శిగా

ఈ కార్యక్రమంలో తాను, తన కుటుంబం కూడా మార్గదర్శులగా ఉంటామని చంద్రబాబు ప్రకటించారు. పేదరికంపై పోరులో తాము భాగస్వాములవుతామన్నారు. మరింత మంది సంపన్నులు మార్గదర్శులుగా ముందుకు వచ్చేందుకు తన నిర్ణయం ఉపకరిస్తుందన్నారు. పి-4 ప్రజా ఉద్యమంలా సాగుతోందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు అధికారులు మరింతగా పనిచేయాలని నిర్దేశించారు. కార్పొరేట్ సంస్థలను సమన్వయం చేసుకునేందుకు కలెక్టర్లు శ్రద్ధ చూపించాలన్నారు. ఈ సమీక్షలో ఆర్థిక, ప్రణాళికశాఖతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల ఊసే లేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్యాకేజీ లేదని అధికారులు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు, చింతూరు ఐటిడిఏ పిఒకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా ఫలితం లేకపోయిందన్నారు. 2022లో వచ్చిన పోలవరం బ్యాక్ వాటర్ వల్ల చెరువు గండి పడిందని, దాన్ని పూడ్చకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. దేవీపట్నం మండలంలోని చిన్నారి గండి కాలనీ, పెనికిలపాడు, సీతారాం కాలనీల వాసులూ తమ కష్టాలను బృందం దృష్టికి తీసుకొచ్చారు.

మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి : వి శ్రీనివాసరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయాన్నే ఆలోచిస్తూ నిర్వాసితులను పట్టించుకోవడం లేదని వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ నిర్వాసితులను త్రిశంకు స్వర్గంలో పెట్టినట్లు ఉందని, ఉన్న ఊరి నుంచి తరిమేసి ఎటువంటి సౌకర్యాలూ కల్పించకుండా పునరావాస కాలనీల్లోకి పంపారని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, స్కూలు, హాస్పిటల్, రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు వంటి కనీస వసతులు కల్పించకుండా నిర్వాసితులపై ఒత్తిడి తెచ్చి కాలనీల్లో పడేశారని తెలిపారు. పునరావాస కాలనీల్లోని సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కోసం తమ సర్వస్వాన్ని వదులుకున్న నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహార విషయంలో మోసగిస్తున్నారని వివరించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల ప్యాకేజీ విషయంలో అన్యాయం జరిగింద న్నారు. అందరూ కలిసికట్టుగా ఉద్యమిస్తే సమస్యలను పరిష్కరించుకో వచ్చుని తెలిపారు. నిర్వాసితుల పక్షాన ఎర్రజెండా ఉందని భరోసా ఇచ్చారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, మర్లపాటి నాగేశ్వరరావు, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో అనర్థాలను వివరిస్తూ... ఇంటింటికి ప్రచారం

ప్రజాశక్తి - యంత్రాంగం : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ, వాటి వల్ల అనర్థాలను వివరిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి అని చెప్పిన టిడిపి నాయకులు నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదానికి దాసోహమయ్యారని పలువురు నాయకులు విమర్శించారు. స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూ అప్ ఛార్జీలు రద్దు అనే ప్రచార భేరి కార్యక్రమాన్ని విజయనగరంలోని 29వ వార్డులో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టారు. స్మార్ట్ మీటర్ల వ్యతిరేకిస్తూ ముద్రించిన స్టిక్కర్లను ఇంటింటికి అతికించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ... అదాని స్మార్ట్ మీటర్స్ బద్దలు కొట్టాలని ఎన్నికల ముందు మాట్లాడిన లోకేష్... ఇప్పుడు వాటిని అనుమతించడం దుర్మార్గమన్నారు. అయ్యప్పనగర్‌లో సాయి అమృత రెసిడెన్సీలో స్మార్ట్ మీటర్లను బిగించేందుకు వచ్చిన సిబ్బందిని అయ్యప్ప నగర్ పోరాట కమిటీ సభ్యులు అడ్డుకున్నారని తెలిపారు. నగరంలో సిపిఎం చేసిన సర్వేలో 2024లో రూ.600 వచ్చిన కరెంట్ బిల్లు నేడు రూ.రెండువేలు వస్తుందన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామంలో నిరసన చేపట్టారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఏలూరు రోడ్డు నుంచి మసీదు సెంటర్ వరకూ ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు.కడకట్ల, రామారావుపేటలో ప్రచార ర్యాలీ నిర్వహించారు.

చైనా వైద్య బీమా భేష్

బీజింగ్ : చైనా ప్రాథమిక వైద్య బీమా మంచి పని తీరును కనబరుస్తున్నది. 2021-2025 కాలంలో ఈ బీమా దాదాపు 95 శాతం కవరేజ్ రేటును సాధించినట్లు నేషనల్ హెల్త్‌కేర్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. 2024లో 132 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ బీమా కింద తమ పేర్లను నమోదు చేసుకున్నారు. 2021 నుంచి 2024 మధ్య దాదాపు రెండు వేల కోట్ల మెడికల్ అపాయింట్‌మెంట్లకు రీయింబర్స్‌మెంట్‌లు అందాయి. గ్రామీణ ప్రాంతాల్లోని అల్పాదాయ కుటుంబాల్లో 99 శాతం ప్రజలకు బీమా లభిస్తోంది.

పెన్షన్‌ల చట్టం సవరణ తగదు

పెన్షన్‌దారుల నిరసనలు, మానవహారాలు



గుంటూరు లక్ష్మీపురంలో నిరసన తెలుపుతున్న పెన్షన్‌దారులు

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం పెన్షన్ చట్టానికి సవరణలు చేయ డాన్ని నిరసిస్తూ ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన పెన్షన్‌దారులు శుక్రవారం పలుచోట్ల నిరసన ప్రదర్శనలు, మానవహారాలు చేపట్టారు. పెన్షన్‌దారులకు తీవ్ర నష్టం కలిగించే 'పెన్షన్ చట్ట సవరణలను రద్దు చేయాలని, 8వ పే కమిషన్‌ను అమలు చేయాలని నినదిం చారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద మానవహారం నిర్వహించారు. బిఎస్‌ఎన్‌ఎల్, పోస్టల్, కస్టమ్స్ ఎక్సైజ్, ఆలిండియా రేడియో, ఎల్‌ఐసి, ఆదాయపు పన్ను శాఖ సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేసిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రామారావు మాట్లాడుతూ నూతన పెన్షన్ బిల్లు పెన్షనర్ల మెడపైన వేలాడే కత్తిలాంటిదన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎంఆర్‌ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ.. 8వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్న మెంట్ ఎంప్లాయిస్ చైర్మన్ కె.సురేష్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెన్షనర్లకు పెన్షన్ పెంచకుండా ఎగ్గొట్టాలని చూస్తోందన్నారు. ఈ సవరణ పెన్షనర్లను కొత్త, పాత అని విభజిస్తుందని తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద విశ్రాంత ఉద్యోగులు మానవహారంగా నిర్వహించారు. తెలుగు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ పెన్షనర్స్ అసోసి యేషన్ రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ నాగేశ్వరరావు, బి. రామారావు (పోస్టల్) మాట్లాడుతూ.. పెన్షనర్లకు హాని కలిగించే వ్యాలిడేషన్ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట విశ్రాంత ఉద్యోగులు ధర్నా నిర్వహిం చారు. అనంతరం మానవహారం చేపట్టారు. తిరుపతిలోని నాలుగు కాళ్ళ మండపం వద్ద, శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని గుర్రాలతో నిరసన


గుర్రాలతో చేపట్టిన నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-అనంతగిరి (అల్లూరి జిల్లా)

ఆంధ్రప్రదేశ్‌ను డోలీరహిత రాష్ట్రంగా మారుస్తామంటూ 'అడవి తల్లి బాట' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రోడ్లకు శంకుస్థాపన చేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా తమ ప్రాంతానికి రోడ్డు నిర్మాణం పూర్తిగా జరగలేదంటూ సిపిఎం ఆధ్వర్యాన మద్దిబు, దాయర్తి గ్రామస్తులు గుర్రాలతో నిరసన తెలిపారు. మద్దిబు నుంచి దాయర్తి, అక్కడి నుంచి గుర్రాల బయలు వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కె.గోవిందరావు, పివిజిజిల సంఘం మండల నాయకులు సీదరి అనంత్, కె.చిన్నారావు మాట్లాడారు. పినకోట పంచాయతీ పరిధి బల్లగరువు గ్రామంలో డిసెంబర్‌లో పవన్ కల్యాణ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినా నేటి వరకూ పనులు చేపట్టలేదన్నారు. పినకోట, పెదకోట, జీనబాడు పంచాయతీల పరిధిలోని గ్రామాల వాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. బల్లగరువు నుంచి వాజంగి, పీచు మామిడి, గుమ్మంతి వరకూ, కోటగరువు మీదుగా దాయర్తి, మద్దిబు నుంచి తునిసీబు గ్రామం వరకూ బిటి రోడ్డు నిర్మాణం కోసం రూ.11కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. బల్లగరువు నుంచి వాజంగికి తలపెట్టిన పనులకు శంకుస్థాపన కూడా చేశారన్నారు. అక్కడి నుంచి ఆ ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు. దీంతో 11 గ్రామాల్లోని గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రేషన్‌కు వెళ్లాలన్నా సుమారు 24 కిలోమీటర్ల మేర నడక సాగించాల్సి వస్తోందన్నారు. జిల్లా కలెక్టరైనా తమ సమస్యలపై స్పందించాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున భారీ డోలీ యాత్ర చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.సోమన్న, కొండతాంబలి నర్సింగరావు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ వ్యాపారులపై చర్యలు

- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గంజాయి, డ్రగ్స్, మద్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి రామన్న, వై రాము శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ వన్‌టౌన్‌లో ఈగల్ టీం, టాస్క్‌ఫోర్స్ జరిపిన తనిఖీల్లో చిన్న బడ్డీకొట్టులో దాదాపు 110 ప్యాకెట్లలో 4,400 గంజాయి చాక్లెట్లు దొరకడం అత్యంత ప్రమాదకరమైన విషయమన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు విజయవాడ అడ్డాగా మారిందన్నారు. డ్రగ్స్, గంజాయి ఇప్పుడు పాఠశాల స్థాయికి చేరి చిన్న పిల్లలను సైతం వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈగల్ టీంకు మరిన్ని అధికారాలు, నిధులు కేటాయించి పాఠశాలలు, కళాశాలల వద్ద, ముఖ్యమైన కూడలిలో నిఘా పెట్టాలని కోరారు. గంజాయి ఉత్పత్తి జరుగుతున్న ప్రాంతాన్ని, సరఫరా, ఉపయోగిస్తున్న వారిపై దృష్టి సారించాలని సూచించారు. 'డ్రగ్స్, గంజాయి అంతం, డివైఎఫ్ఐ పంతం' అనే నినాదంతో తమ సంఘం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే సదస్సులు, ర్యాలీలు, కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. గంజాయి, డ్రగ్స్‌ను తరిమికొట్టి ఉద్యోగాలు, ఉపాధి కోసం పోరాడేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో
కింది కోర్టు ఉత్తర్వులపై స్టేకు నిరాకరణ

ప్రజాశక్తి-అమరావతి

డ్రైవర్ హత్య, డెడ్‌బాడీ హోం డెలివరీ అభియోగాలపై నమోదైన కేసులో వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్ వి సుబ్రమణ్యం హత్య కేసును తదుపరి దర్యాప్తునకు కింది కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. కింది కోర్టు ఈ నెల 22న ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. సుబ్రమణ్యం శరీరంపై 33 గాయాలున్నాయని అతని తల్లి అనుమానాన్ని వ్యక్తం చేస్తూ కూటమి సర్కారు వచ్చాక డిజిపికి వినతి సమర్పించారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి మృతదేహాన్ని హోం డెలివరీ చేశారనే అభియోగాల కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతినిస్తూ రాజమహేంద్రవరం ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆ ఉత్తర్వులను అనంతబాబు హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. కింది కోర్టు ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని, దర్యాప్తు అయ్యాక మళ్లీ కేసు విచారణ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను కింది కోర్టు ఆమోదించడం చెల్లదని అనంతబాబు తరపున సీనియర్ న్యాయవాది సి రఘు అన్నారు. 2022 మే 19న కాకినాడకు చెందిన సుబ్రమణ్యాన్ని హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబును మాత్రమే నిందితుడిగా చేర్చారని, ఇతరుల పాత్ర కూడా ఉందంటూ సుబ్రమణ్యం తల్లిదండ్రులు ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారని, దీంతో తదుపరి దర్యాప్తు తిరిగి కొనసాగించేందుకు అనుమతినివ్వాలంటూ ప్రాసిక్యూషన్ ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో పిటిషన్ వేసిందని వివరించారు. ఈ నెల 22న కింది కోర్టు ఉత్తర్వులు ఇవ్వడం ఏకపక్షమన్నారు. తల్లి వినతిపత్రం తప్ప కొత్త సాక్ష్యం లేదన్నారు. 'స్టే జారీకి అనుమతి ఇవ్వలేం. తదుపరి దర్యాప్తు చేయడానికి మాత్రమే కింది కోర్టు అనుమతి ఇచ్చింది. ఇప్పటికే ఈ కేసులో అనంతబాబు నిందితుడుగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో అనంతబాబుపై ప్రతికూల ప్రభావం ఉంటుందనే వాదన ఆమోదయోగ్యం కాదు' అని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

గ్యాంగ్ రేప్ కేసులో నిందితుడికి 20 ఏళ్లుశిక్ష

ప్రజాశక్తి - గుంటూరు లీగల్ (గుంటూరు జిల్లా)

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తాడేపల్లి గ్యాంగ్‌రేప్ కేసులో రెండో నిందితుడైన సీరు కష్ణ కిషోర్‌కు 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.62 వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదవ అదనపు జిల్లా జడ్జి కె. నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. అప్పటి ముఖ్యమంత్రి ఇంటికి కూతవేటు దూరంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో పెద్ద దుమారాన్ని రేపింది. విజయవాడలోని ఓ ఆసుపత్రిలో పనిచేసే నర్స్ తన డ్యూటీ ముగించుకొని 2021 జూన్ 19న రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో తన మిత్రుడితో కలిసి తాడేపల్లి సీతానగరం ఘాట్‌కు వచ్చారు. ఇసుక తిన్నెలపై సరదగా గడిపిన అనంతరం ఇంటికి బయలుదేరుతుండగా వారిని నిందితులు రామలింగం ప్రసన్నరెడ్డి అలియాస్ వెంకట్, సీరు కృష్ణకిషోర్ అటకాయించారు. పాత రైల్వే బ్రిడ్జి కిందకు తీసుకువెళ్లి అత్యాచారం చేశారు. తన మిత్రుడితో కలిసి తాడేపల్లి పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆగస్టు ఏడున కష్ణ కిషోర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో అత్యాచారంతో పాటు మరో వ్యక్తిని కూడా రైల్వే బ్రిడ్జి కింద హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. మొదటి నిందితుడు ప్రసన్నరెడ్డి ఆచూకీని పోలీసులు కనుగొనలేకపోవడతో కృష్ణకిషోర్‌పై విచారణ సాగింది. 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. నిందితుడికి విధించిన జరిమానా రూ. 62 వేలను బాధితురాలికి చెల్లించాలని, మరో లక్ష రూపాయలు ప్రభుత్వం నుంచి ఆమెకు అందేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను కోర్టు ఆదేశించింది.

పవన్‌పై కేసు వాపస్ ఆర్డర్ ఇవ్వండి

- హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై రాష్ట్ర ప్రభుత్వం వేసిన పరువు నష్టం కేసు ఉపసంహరణకు గుంటూరు కోర్టు అనుమతినిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీని సమర్పించాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు శుక్రవారం ఆదేశించారు. విచారణను 2 వారాలకు వాయిదా వేశారు. వలంటీర్ల వల్లే ఆడ పిల్లలు మాయమవుతున్నారని పవన్ కల్యాణ్ 2023లో ఏలూరులో జరిగిన వారాహి యాత్రలో అన్నారని, ఈ వ్యాఖ్యలు ప్రభుత్వ పరువు, ప్రతిష్టకు భంగం చేకూరేలా ఉన్నాయంటూ గతంలోని వైసిపి ప్రభుత్వం క్రిమినల్ కేసు దాఖలు చేయాలని గుంటూరు కోర్టు పిపిని ఆదేశిస్తూ జిఓ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పవన్‌పై ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకుంది. ఈ మేరకు పిపి అభ్యర్థనకు గుంటూరు కోర్టు అనుమతినిచ్చింది. ఈ మేరకు నవంబరు 18న వెలువడిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ వలంటీర్ కె సరళ హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.

'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతోంది : సిడిఎస్

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ ఇప్పటికీ కొనసాగుతోందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ శుక్రవారం వెల్లడించారు. దేశ సైనిక సంసిద్ధత అనేది 24 గంటలూ, ఏడాది పొడవునా 'అతి తీవ్రత'తో ఉండాలని అన్నారు. ఇక్కడ జరిగిన ఒక 'సెమినార్'లో ఆయన మాట్లాడుతూ.. 'యుద్ధంలో రన్నరప్‌లు ఎవ్వరూ ఉండరు. ఇందుకు ఉదాహరణ ఆపరేషన్ సిందూర్. ఇది ఇప్పటికీ కొనసాగుతోంది. మన సంసిద్ధత స్థాయి చాలా ఎక్కువగా ఉండాలి. వారంలో ఏడు రోజుల పాటు, ఏడాది పొడవునా ఈ సంసిద్ధత ఉండాలి. ఆకాశమే సరిహద్దుగా, భిన్నంగా ఆలోచించడం ద్వారా ఇలాంటి సంసిద్ధతను సైనిక నిపుణులు మాత్రమే నిర్వహించగలరు' అని తెలిపారు. ప్రస్తుత కాల సైనికులు కేవలం యుద్ధం గురించి మాత్రమే తెలుసుకుంటే చాలదని, సాంకేతిక, జ్ఞానం గురించి కూడా తెలుసుకుండాలని చౌహాన్ తెలిపారు. ప్రస్తుతం మనం సైనిక సాంకేతిక పరిజ్ఞానంలో మూడో విప్లవంలో ఉన్నామని అన్నారు.

బాంబే హైకోర్టు వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకం

- తీవ్రంగా ఖండించిన సిపిఎం

న్యూఢిల్లీ : బాంబే హైకోర్టు బెంచ్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమానికి వ్యతిరేకంగా నిరసన తెలపడానికి ముంబయి పోలీసులు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు ధర్మాసనం తిరస్కరిస్తూ చేసిన వ్యాఖ్యలను సిపిఎం ఖండించింది. ఈ అంశంపై పొలిట్‌బ్యూరో విడుదల చేసిన ప్రకటన వివరాలిలా ఉన్నాయి. ఈ సందర్భంగా సిపిఎం దేశభక్తిని గురించి ప్రశ్నించడం సరికాదు. రాజ్యాంగంలోని నిబంధనల గురించి, రాజకీయ పార్టీకి చట్టబద్ధమైన హక్కుల గురించి, మన దేశ చరిత్ర గురించి, పాలస్తీనాకు మన దేశ ప్రజల సంఘీభావం, మాతృభూమి కోసం ఉండే చట్టబద్ధమైన హక్కు గురించి బెంచ్ తెలియనట్టు కనిపిస్తోంది. ధర్మాసనం పరిశీలనలు కేంద్ర ప్రభుత్వానికి అనుగుణంగా రాజకీయ పక్షపాతాన్ని సూచిస్తున్నాయి. 'పాలస్తీనా వైపు లేదా ఇజ్రాయిల్ వైపు వెళ్లాలనేది ఎంత గందరగోళానికి దారితీస్తుందో మీకు తెలియదు. మీరు ఎందుకు ఈ కార్యక్రమం చేయాలనుకుంటున్నారు? మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీని బట్టి చూస్తే మీరు దేశ విదేశాంగ వ్యవహారాలకు ఏమి చేస్తున్నారో మీకు అర్థం కావడం లేదు' అని బెంచ్ వ్యాఖ్యానించింది. 'మీరు దేశంలో నమోదైన సంస్థ. చెత్త పారవేయడం, కాలుష్యం, మురుగునీటి పారుదల లాంటి అనేక సమస్యలు ఉన్నాయి. ఉదాహరణలు మాత్రమే మేము ఇస్తున్నాం. మీరు వాటిపై కాకుండా దేశం వెలుపల వేల మైళ్ల దూరంగా జరుగుతున్న దానిపై నిరసన తెలుపుతున్నారు' అని ధర్మాసనం పేర్కొంది. గత శతాబ్దంలోని 1940లలో మహాత్మాగాంధీ జాతీయ ఉద్యమం, స్వతంత్ర భారతదేశం తదనంతర విదేశాంగ విధానం, పాలస్తీనా ప్రజల స్వేచ్ఛ, మాతృభూమి హక్కుకు మద్దతు ఇవ్వడంలో వెనకాడలేదనే వాస్తవాన్ని ఈ పరిశీలనలు విస్మరిస్తున్నాయి. ఇజ్రాయిల్ చర్యకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఖండనలు, ఐక్యరాజ్య సమితి సంస్థలు, అంతర్జాతీయ న్యాయస్థానం తీసుకున్న వైఖరిని బెంచ్ గ్రహించలేదనే వాస్తవాన్ని ఇది స్పష్టంగా తెలియజేస్తుంది. ఇటువంటి వైఖరిని ఖండించేందుకు, నిస్సందేహంగా తిరస్కరించేందుకు మాతో కలిసిరావాలని, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే దేశ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం' అని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది.

జమీన్‌రైతు సంపాదకునికి బెదిరింపులు

- తీవ్రంగా హెచ్చరించిన వేమిరెడ్డి అనుచరులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జమీన్‌రైతు సంపాదకులు, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.డోలేంద్ర ప్రసాద్‌ను నెల్లూరు ఎంపి వేమిరెడ్డి అనుచరులు బెదిరించారు. శుక్రవారం చిల్డ్రన్‌పార్కు రోడ్డులోని ఆయన కార్యాలయానికి వెళ్లిన వేమిరెడ్డి ముఖ్య అనుచరులు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టిడిపి నాయకులు కమలాకర్‌రెడ్డి, గోపిరెడ్డి, కేతం వినోద్‌రెడ్డిలు రెండ్రోజుల క్రితం సైదాపురం మైనింగ్ విషయమై జమీన్‌రైతు ప్రచురితమైన కథనం గురించి వివరణ అడిగారు. ఇదంతా అవాస్తవమని వేమిరెడ్డికి క్షమాపణలు చెప్పాలని లేకుంటే బాగుండదంటూ బెదిరింపులకు దిగారు. వచ్చే వారం పత్రికలోనే సమాధానం ఇస్తానని డోలేంద్ర ప్రసాద్ చెప్పినా.. పట్టించుకోలేదు. రోజులు మారాయని, గతంలో ఏదో చేశాం, ఇప్పుడు అలాగే చేస్తామంటే కుదరదంటూ మాట్లాడారు. ఈ పరిణామం నెల్లూరు నగరంలో చర్చనీయాంశంగా మారింది. వరుసగా జరుగుతున్న ఈ తరహా సంఘటనల పట్ల టిడిపి నాయకులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకురావాలి

- ప్రతిపక్ష నేత రాహుల్ డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. భారతదేశపు ఉత్పాదక శక్తికి ఒబిసిలు ప్రతీకలని అన్నారు. శుక్రవారం నాడిక్కడ జరిగిన 'బాగిదారి న్యాయ మహా సమ్మేళనం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఒబిసిల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశాయని అన్నారు. దేశంలో దళితుల చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారని చెప్పారు. ఒబిసిల చరిత్ర రాయక పోవడం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర ఉందని విమర్శించారు. ఒబిసిలు వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. 'కార్పొరేట్ ఇండియాలో ఒబిసిలు ఎక్కడున్నారు? మీడియా రంగంలో వారికి స్థానం ఎక్కడుంది?' అని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయలేకపోయామని, అది ముమ్మాటికీ తన తప్పిదమేనని అన్నారు. 'మీ (ఒబిసి) చరిత్ర, సమస్యలను కొంచెం ముందుగానే తెలుసుకుని ఉన్నట్లయితే అప్పట్లోనే కులగణన చేపట్టి ఉండేవాడిని. అది కాంగ్రెస్ పార్టీ తప్పు కాదు, ముమ్మాటికీ నా తప్పే. ఇప్పుడు ఆ తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నాం' అని రాహుల్ అన్నారు. కులగణన కూడా ఎప్పుడో చేయాల్సి ఒదని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తప్ప కుండా కులగణన పూర్తి చేస్తామని తెలిపారు. తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్ అని రాహుల్ గాంధీ అన్నారు. అభివృద్ధిలో విద్యే ప్రధానమని, ఇంగ్లీష్ నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపవుతాయని చెప్పారు. బిజెపి నేతలు మాత్రం ఇంగ్లీష్‌ను వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ప్రాంతీయ భాషలూ ముఖ్యమేనని, దాంతోపాటు ఆంగ్ల ప్రాధాన్యాన్నీ అర్థం చేసుకోవాలని అన్నారు. ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్న వారు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని ప్రశ్నించారు.



ఉదయం నిద్ర లేవగానే పిల్లలకి ఆకలిగా ఉంటుందని ప్రతి తల్లీ తెగ కంగారు పడిపోతూ తినడానికి ఏవైనా తయారు చేస్తుంది. పరీక్షలకి సిద్ధమవుతున్న పిల్లలకైతే అదనపు శక్తి కోసం పోషకాలు ఉన్న ఆహారం సిద్ధం చేస్తారు. గాజాలో తల్లులు అందుకు భిన్నమైన పరిస్థితుల్లో ఉన్నారు. ఆకలిగా ఉందని, రెండు బిస్కెట్లు కావాలని అడిగిన పిల్లలకు ఏమీ తేలేక ఆ తల్లులు గుడ్లనీరు కుక్కుకుంటూ ఏడుస్తున్నారు. పొట్టకి అతుక్కుపోయిన కడుపులతో 'ఆకలి.. ఆకలి..' అని అరుస్తున్న ఆ బిడ్డల ఆకలి తీర్చే దారి కనపడక రోదిస్తున్నారు. ప్రపంచంలో అన్నిచోట్లా యువత విందులు, వినోదాలతో ఖుషీ చేస్తుంటే, గాజా యువత మాత్రం ఆకలితో అలమటిస్తూ ఆన్‌లైన్లో పరీక్షలు రాస్తున్నారు. ఖరీదైన పండ్లను, మత్స్య సంపదని విదేశాలకి ఎగుమతి చేసిన చరిత్ర గల గాజా ఇప్పుడు కరువుతో కొట్టుమిట్టాడుతోంది. ఈ కరువు వారు కోరుకున్నది కాదు. 'ప్రపంచ మౌనంతో మేము బాధ్యులం అయ్యాము' అని ఆ ప్రజలు బరువైన గుండెలతో దీనంగా అరుస్తున్న ఆకలికేకలు ప్రపంచ నలుమూలలా వినిపిస్తున్నాయి.

JEEVANA జీవన the family

స్వీయ రక్షణ



వేద ఒకరోజు సాయంత్రం బడి నుండి ఇంటికి రావడమే ఏడుస్తూ వచ్చింది. అది చూసి వాళ్ళ అమ్మ శాంత చాలా కంగారుపడింది. 'ఎందుకమ్మా ఏడుస్తున్నావు? ఏమైంది?' అని దగ్గరకు తీసుకుని అడిగింది.

'అమ్మా! నన్ను దివ్య కొట్టింది' అంది వేద. 'ఎందుకు కొట్టింది? నువ్వేం చేయకుండా ఎవరూ కొట్టరు కదా?' అంది శాంత.

'నేను ఏమీ చేయలేదమ్మా, టీచర్ ఇచ్చిన హోమ్ వర్క్ తను ఇంటి దగ్గర చేయడం లేదు. బడికి రాగానే నా పుస్తకాలు ఇవ్వమని అడుగుతుంది. నేను ఇవ్వనంటే నాతో ఎవరినీ జతగా ఉండనివ్వనని బెదిరిస్తోంది. అందుకే రోజూ నా పుస్తకాలు ఇస్తాను. వెనక బెంచీలో కూర్చుని అన్నీ కాపీ చేస్తుంది. దివ్య దగ్గర నా పుస్తకాలు ఉండటంతో ఈరోజు టీచర్ నన్ను పిలిచి అడిగారు. నేను జరిగిన విషయం చెప్పాను. టీచర్ దివ్యను చాలా కోప్పడ్డారు, నన్ను మరోసారి పుస్తకాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. అందుకని ఈ రోజు దివ్య అడిగినా ఇవ్వలేదు. ఆ కోపంతో బడి వదలగానే నా వెనకాల పరుగెత్తుకుంటూ వచ్చి కావాలని తోసేసి, 'సారీ' చెప్పి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది' అంటూ ఏడ్చింది వేద.

'వేదా ... దివ్య నీ క్లాస్‌మేట్. తను చేసేది తప్పని తెలియక ఇలా చేస్తోందేమో! ఈ ప్రవర్తన తప్పని తనకి చెప్పు. పుస్తకాలు ఇవ్వనని ధైర్యంగా చెప్పు' అని శాంత మాటలు పూర్తవ్వకుండానే వేద, 'అమ్మా మరి నాతో ఎవరినీ స్నేహంగా ఉండకుండా చేస్తానంటోంది. మాటిమాటికీ నన్ను తోసేస్తుంది, లేకపోతే గిల్లేస్తుంది. అప్పుడు ఎలా?' అని ఏడుపు గొంతుతో అంది.

'నువ్వు భయపడితే అలాగే బెదిరిస్తుంది. నువ్వు అందరితో కలిసిమెలిసి ఉంటే నీ స్నేహితులు నిన్ను ఎప్పటికీ వదలరు. నీలో ఉన్న పిరికితనమే నిన్ను అన్నింటిలో వెనుకడుగు వేయిస్తుంది. ఏ విషయానికైనా నిన్ను నువ్వు రక్షించుకునే ప్రయత్నం చేయాలి. నీ వల్ల కానప్పుడు పెద్దవాళ్ళ సహాయం తీసుకోవాలి. అంతే కానీ ఏడుస్తూ కూర్చోకూడదు' అంది శాంత.

శాంత మాటలతో వేదకి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. 'సరే అమ్మా! ఇకనుండి దివ్య బెదిరింపులకు నేను భయపడను. నన్ను మళ్ళీ కొడితే టీచర్‌కి చెప్తాను' అని సంతోషంగా అక్కడి నుండి వెళ్లిపోయింది వేద.

- కె.వి.సుమలత,
94926 56255.

నేను గీసిన బొమ్మ



పి.గణేష్
7వ తరగతి,
జిల్లా పరిషత్ హైస్కూలు,
కొల్చారం, మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మాపై సానుభూతి వద్దు..

ఆకలితో అలమటించకుండా చేయండి చాలు ...

గాజా కరువు హెచ్చరిక కాదు. అంచనా కూడా కాదు. ఇది రోజువారీ దినచర్యగా మారింది.

నిద్రలేవగానే రొట్టెలు అడిగిన బిడ్డకి అవి లేవన్న నిజం తెలియదు. యుద్ధం, దాని పర్యవసానాలు, రాజకీయాలు అసలే తెలియవు. వాళ్లకి తెలిసిందల్లా ఆకలి.. ఈ పరిస్థితిని, గాజా ప్రజలు పడుతున్న ఇబ్బందులను యూనివర్శిటీ విద్యార్థి తక్వా ఆల్ వావీ ఇలా అంటున్నారు.

'నూర్.. మా పెద్ద అక్క తస్నీమా కూతురు. 2021 మే నెలలో అది పుట్టింది. దాని తమ్ముడు ఎజ్ అల్దిన్ 2023 డిసెంబరులో పుట్టాడు. ఒక రోజు తస్నీమా తన భుజాలపై పిల్లలిద్దరినీ మోసుకుని వచ్చింది. అప్పుడు నేను తస్నీమా, పిల్లలిద్దరూ ఆకలిని అర్థం చేసుకుంటున్నారా? మనం కరువులో ఉన్నామని వాళ్లకి తెలిసిందా? అని అడిగాను. 'హా తెలిసింది. ఎజ్ కూడా ఈ పరిస్థితిని అర్థం చేసుకుంటున్నాడు. వాడు ఇంతవరకు అసలైన ఆహారం తినలేదు. అసలు ఆహారంలో ఎన్ని రకాలు ఉన్నాయో కూడా వాడికి తెలియదు. ఆకలిగా ఉందని రొట్టె అడగడమే వాడికి తెలిసింది. అప్పుడు కూడా నేను వాడికి రొట్టెని ఇవ్వలేకపోతున్నాను. పిండి కోసం నాన్న బయటికి వెళ్లాడని అబద్ధం చెబుతున్నాను. ఆలస్యమైతే పిండి కోసం వెతుకుతున్నాడని అంటున్నాను. అయినా నా బిడ్డ ఏం అడుగుతున్నాడు? చిన్న రొట్టెముక్క.. అది కూడా నేను ఇవ్వలేకపోతున్నాను.' అని తస్నీమా ఏడుస్తూ చెప్పిందని తక్వా చెప్పారు. తక్వా ఇంకా అనేక అనుభవాలను ఇలా పంచుకున్నారు.

'నూర్ తన తల్లి దగ్గర అంకెలు, అక్షరాలు నేర్చుకుంది. ఇజ్రాయిల్ దాడులకు ముందు బిస్కెట్లు, చాక్లెట్లు ఎక్కువగా తినేది. ఆ పిల్ల మా కుటుంబంలో పుట్టిన మొదటి సంతానం. చాలా గారాబంగా పెంచాం. కానీ ఇప్పుడు అది అడిగిన రెండు బిస్కెట్లు కూడా ఇవ్వలేకపోతున్నాం. ఒక్కసారి మా పిల్లలను చూడండి. ఆకలితో అలమటించి వారు చనిపోతున్నారు' అని తక్వా ఎంతో ఆవేదన చెందుతోంది.

ఈ మధ్య గాజాలో ఒక వ్యక్తి తన కుటుంబంలో ఏడుగురు వ్యక్తుల మృతదేహాల వద్ద విలపిస్తూ కూర్చొన్న వీడియో వైరల్ అయ్యింది. దాని గురించి కూడా తక్వా మాట్లాడింది. 'ఆ వ్యక్తి, ఆ మృతదేహాల వద్ద కూర్చొని, 'మేం ఆకలితో ఉన్నాం' అని ఏడుస్తున్నాడు. ఆ కుటుంబమంతా కొన్ని రోజులుగా ఏవిధమైన ఆహారం తీసుకోలేదు. ఆ సమయంలోనే ఇజ్రాయిల్ డ్రోన్లు వారి టెంట్ పక్కన బాంబుల వర్షం కురిపించాయి. ఆ రోజు బాంబులు కురవకపోయినా ఆ కుటుంబమంతా ఆకలితో చనిపోయేవారని ఆ వ్యక్తి ఏడుస్తున్నాడు. మృతదేహాల మీద మూసివుంచిన దుప్పట్లు తీసి, 'ఇదిగో.. ఇతనే నేను అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు' అని చూపిస్తూ ఏడుస్తున్నాడు' అని వివరించింది. ఇంకా గాజాలో నెలకొన్ని అనేక దుర్భరపరిస్థితుల గురించి తక్వా చెప్పారు.



'గాజాలో కోటీశ్వరులకు కూడా ఇప్పుడు రొట్టెలు దొరకడం లేదు. సంచి నిండా బియ్యం, క్యాన్ నిండా పాలు ఎక్కడా లేవు. మార్కెట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. షాపులు మూతబడ్డాయి. మాల్స్ కూలిపోయాయి. కానీ ఒకప్పుడు మేము ఇక్కడ ఎన్నో పంటలు పండించాం. పండ్లు, కూరగాయలు, స్ట్రాబెర్రీలు యూరప్‌కి ఎగుమతి చేశాం. అవన్నీ ఇక్కడ చాలా చౌకగా దొరికేవి. ద్రాక్ష, యాపిల్ కేజీ సుమారు 75 రూపాయలకు వచ్చేవి. కేజీ చికెన్ రూ.235 వచ్చేది. కానీ ఇప్పుడు ఒక గుడ్డు కూడా దొరకడం లేదు. 21 కేజీల పుచ్చకాయ రూ.433కి వచ్చేది. కానీ, అదే కాయ ఇప్పుడు రూ.21,540కి లభిస్తోంది. ఎంతో ఖరీదైన అవకాడోలు ఖాన్‌యూనిస్, రఫాలో విరివిగా పండించేవాళ్లం. ఇప్పుడవేవీ ఇక్కడ లేవు.

మా పిల్లలు ఏం తప్పు చేశారు? వారి ప్రాథమిక హక్కులు కోల్పోయారు. కనీసం బ్రేక్‌ఫాస్ట్, పాలు కూడా వాళ్లకి దొరకడం లేదు. ఇక్కడ చిన్నారులకి కరువు, అధిక ధరలు వంటివేవీ అర్థం కావు. వాళ్లకి తెలిసిందల్లా ఖాళీ కడుపులతో నిండిపోయిన ఆకలి..

గాజా ప్రజలకు మత్యసంపద ఆహారంలో ఒక భాగం. కానీ ఇప్పుడు అది అరుదైనదిగా మారిపోయింది. సముద్రమంతా నిశ్శబ్దంగా కనిపిస్తోంది. మేము ఇక్కడ భోజనం చేస్తున్నాం. అయితే అది రోజులో ఒక పూటే. రాత్రి సమయంలో రొట్టె, బీన్స్ ఏది దొరికితే అదే మా ఆహారంగా ఉంది. ప్రపంచంలో చాలామంది టైంపాస్‌గా తినే ఆహారం మాకు ఇప్పుడు లగ్జరీ ఆహారంగా ఉంది. చాలా రోజులు మేం నీళ్లు తాగుతున్నాం. ఒక్కోరోజు అవి కూడా ఉండడం లేదు. ఆకలి తీవ్రరూపంలో తాండవిస్తోంది. ఈ సమయంలో మేము మా పాత ఆహారఫొటోలను చూస్తూ కాలక్షేపం చేస్తున్నాం. ఒకప్పుడు మేం ఏం తిన్నామో గుర్తుచేసుకుంటున్నాం.

ఆకలితో పరీక్షలు రాస్తున్నాం..

ఆకలితో అలమటిస్తూ చదువుకుంటున్నాం. ఆన్‌లైన్లో యూనివర్శిటీ పరీక్షలను రాస్తున్నాం. నేను యూనివర్శిటీ రెండో సంవత్సరం చదువుతున్నాను. ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలను ఇటీవలె పూర్తిచేశాను. మా చుట్టూ ఆకలి, బాంబుదాడులు, భయం చుట్టుముట్టాయి.

అయినా పరీక్షలు రాశాం. ఖాళీ కడుపులతో రాశాం. ఒక పక్క యుద్ధ విమానాలు గాల్లో ఎగురుతున్నాయి. మరోపక్క పరీక్షలు రాసే మా చేతులు ఆకలితో వణుకుతున్నాయి. చివరిసారి రొట్టె ఎప్పుడు తిన్నామో కూడా మాకు గుర్తులేదు. నేను ప్రతి రోజూ వాట్సాప్‌కాల్‌లో నా స్నేహితులతో మాట్లాడుతున్నాను. మేం ఒకరికొకరు అడిగి తెలుసుకునే ప్రశ్నలు ఒకేలా ఉంటాయి.

ఈ రోజు ఎలా గడిచింది?
చదువుపై శ్రద్ధ పెట్టగలిగావా?
అనేవే ఆ ప్రశ్నలు..

అసైన్‌మెంట్స్, లెక్చరర్స్ గురించి మేం ఎప్పుడూ ప్రశ్నించుకోలేదు. ఆకలి, తలనొప్పి, అలసట గురించే తెలుసుకుంటాం. ఒకసారి మా స్నేహితురాలు 'లేచి నుంచొంటే ఆకలితో కళ్లు తిరిగి పడిపోయాన'ని చెప్పింది. 'కడుపంతా ఖాళీ అయిపోయి వికారంతో వాంతులు అయ్యాయ'ని మరో స్నేహితురాలు చెప్పింది. ఇలాంటి పరిస్థితుల్లోనే జులై 15న మా సెమిస్టర్ చివరి పరీక్ష రాశాం.

మేము బలంగా లేం. అయినా సెమిస్టర్ కోల్పోకూడదనుకున్నాం. ఆ పట్టుదలతోనే పరీక్షలు రాశాం. పరీక్షలు రాస్తున్నప్పుడు బాంబు దాడులతో కుప్పకూలుతున్న భవనాలు, శిథిలాల కింద మృతదేహాలు గుర్తొచ్చి మా గుండెవేగాన్ని పెంచాయి. అయినా ఆ క్షణం మేము ఎంత ఆకలితో ఉన్నామో గుర్తుచేసుకున్నాం. విచిత్రంగా బాంబు దాడి భయం దానంతట అదే మాయమైంది. అయితే ఈ భావన, మేం బాగానే ఉన్నామన్న అర్థం కాదు. మాకు వేరే గత్యంతరం లేదు కాబట్టి..

గాజాపై సానుభూతి ప్రకటించవద్దు. ఎందుకంటే మేం దీన్ని మళ్లీ పునర్నిర్మించుకోగలం. కానీ అంతకంటే ముందుగా మమ్మల్ని ఆకలి బాధల నుండి విముక్తి చేయండి.

చంపడం, ఆకలితో అలమటించేలా చేయడం, ముట్టడి చేయడం పరిస్థితులు కాదు. ఇవి మాపై బలవంతంగా రుద్దబడిన చర్యలు' అని తక్వా ముగించింది.

'ఎస్ఐఆర్'.. ప్రజాస్వామ్యంపై దాడే

- కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన
- ఐదోరోజూ స్తంభించిన పార్లమెంటు, 28కి వాయిదా
- రాజ్యసభ సభ్యునిగా కమల్ హాసన్ ప్రమాణ స్వీకారం



ఎస్ఐఆర్ అని రాసిన పోస్టర్లను చించివేస్తున్న మల్లికార్జున ఖర్గే, నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌పై చర్చకు అంగీకరించకపోవడంతో... పార్లమెంటు ఉభయ సభలు ఐదోరోజూ స్తంభించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని, ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై మోడీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఉద్దేశపూర్వకంగా జరుపుతున్న దాడి అని విమర్శించారు. ఉభయసభలు ఈ నెల 28కి వాయిదా పడ్డాయి. రాజ్యసభ సభ్యులుగా ప్రముఖ సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉభయ సభలు శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశమయ్యాయి. సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఎంపిలు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టుబట్టారు. ముఖ్యంగా బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చించాలని డిమాండ్ చేశారు.

సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఎలాంటి చర్చా లేకుండానే మధ్యాహ్నం 2 గంటల వరకూ సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు. దీంతో సభను ఈ నెల 28కి వాయిదా వేస్తున్నట్లు స్పీకరు ప్రకటించారు. రాజ్యసభలోనూ అదే పరిస్థితి కొనసాగింది. సభ ప్రారంభంకాగానే సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకులు కమల్ హాసన్ రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత ప్రతిపక్ష ఎంపిల నిరసనలతో సభ వాయిదా పడింది.

28న పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ ఘటనలపై పార్లమెంటు ఉభయ సభల్లో చర్చించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ రెండు అంశాలపై చర్చించాలంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నా... ఇన్ని రోజులు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చర్చకు అంగీకరించకుండా మొండిగా వ్యవ హరించిన సంగతి తెలిసిందే. వరుసగా పార్లమెంటు ఉభయ సభలు వాయిదా పడుతూ వచ్చాయి. ఈ నెల 28న రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో చర్చను ప్రారంభిస్తారు. చర్చలో హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో పాటు బిజెపి ఎంపిలు అనురాగ్ ఠాకూర్, నిషికాంత్ దూబే పాల్గొంటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చర్చలో పాల్గొనే అవకాశం ఉంది. రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా చర్చలో ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. ఈ నెల 29న రాజ్యసభలో ఈ అంశంపై చర్చ ప్రారంభం కానుంది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్‌తో పాటు ఇతర మంత్రులు పాల్గొంటారు. రాజ్యసభలో చర్చలోనూ ప్రధాని పాల్గొనే అవకాశం ఉంది.

బిఎసి సమావేశం

సభలో నిరసనలకు బ్రేక్ వేసేందుకు లోక్‌సభ స్పీకరు ఓంబిర్లా శుక్రవారం బిఎసి సమావేశం నిర్వహించారు. ప్రశ్నోత్తరాల సమయంలో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు సహకరించాలని ప్రతిపక్ష నాయకులను స్పీకరు కోరినట్లు తెలిసింది. దీంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని ప్రతిపక్ష ఎంపిలు చెప్పినట్లు సమాచారం. సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలూ సజావుగా సాగనున్నాయని సమాచారం. అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే ముందు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు ఆపరేషన్ సిందూర్, పహల్గామ్ ఉగ్రదాడిపై పార్లమెంట్లో చర్చించాలని డిమాండ్ చేశాయన్నారు. ప్రతిపక్షం తొలిరోజు నుంచి పార్లమెంట్లో గందరగోళం సృష్టిస్తుందని, పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం కలిగించొద్దని కోరుతున్నానని అన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గామ్ ఉగ్రదాడిపై ఉభయసభల్లో 16 గంటల చొప్పున మొత్తం 32 గంటలపాటు చర్చ ఉంటుందన్నారు.

ఇండియా బ్లాక్ నిరసన ప్రదర్శన

'ప్రజాస్వామ్యంపై దాడి' అనే బ్యానర్‌తో పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం నుంచి పార్లమెంట్ భవనం ప్రవేశ ద్వారం వరకూ ఇండియా బ్లాక్ ఎంపిలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఐఆర్ అని రాసిన పోస్టర్లను రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే చించివేసి డస్ట్‌బిన్‌లో వేసి, నిరసన తెలిపారు. ఇసి వంటి రాజ్యాంగ సంస్థ 'ఓట్ బందీ' కుట్రలో బిజెపి - ఆర్ఎస్ఎస్‌కు మద్దతు ఇవ్వడం దురదృష్టకరమని ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు.

ఎస్ఐఆర్‌పై ఎందుకు చర్చించరు?

బీహార్‌లో ఎస్ఐఆర్ తదితర అంశాలపై చర్చకు అనుమతించకపోవడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మాజీ స్పీకర్ బలరామ్ జఖ్కర్ తిరస్కరించి నప్పటి నుంచి ఇసి స్వతంత్ర ప్రతిపత్తి కోసం చర్చకు అనుమతించడం లేదని కేంద్రం చెబుతోంది. ఎన్నికల ప్రక్రియపై చర్చించేందుకు అనేక నిబంధనలున్నాయని, సాకులు చూపి ఓట్ల చౌర్యం తదితర అంశాలపై చర్చించేందుకు అంగీకరించడం లేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ మీడియాతో చెప్పారు.

వ్యవసాయ కార్మికులపై బిజెపి ప్రభుత్వ దాడి

- వ్యవసాయ కార్మిక సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలపై బిజెపి ప్రభుత్వం రెండు పద్ధతుల్లో దాడులకు పాల్పడుతోందని అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదల ఉపాధి హక్కును దెబ్బతీయడమే కాకుండా, వారి ఓటు హక్కును కూడా హరించేందుకు కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం నాడిక్కడ బికెఎంయు కార్యాలయంలో అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కారు రెండు వైపులా ప్రజలపై దాడులు చేస్తోందని విమర్శించారు. ఉపాధి లేకుండా, ఓటు హక్కు లేకుండా చేయడంతో పేదలను నూతన దాసులు, సేవకులుగా మార్చడమే లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. ఉపాధి, ఓటు హక్కును కాపాడుకుంటామని, రాజ్యాంగ రక్షణకు వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గుల్జార్ సింగ్ గోరియా, నిర్మల్ (బికెఎంయు), ధీరేంద్ర ఝా, నివాస్ (ఎఐఎఆర్ఎల్ఎ), ధర్మేందర్, వర్మ (ఎఐఎకెఎస్‌యు), అసిత్ గంగూలీ, డాగర్ (ఎఐఎస్‌కెఎస్) పాల్గొన్నారు.

రూట్ సెంచరీ

- ఇంగ్లండ్ 544/7
- సుందర్, జడేజాకు రెండేసి వికెట్లు



రూట్(150 పరుగులు)

మాంచెస్టర్: నాల్గో టెస్ట్‌లో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ సెంచరీతో కదం తొక్కాడు. మూడోరోజు ఆటలో భాగంగా రెండోసెషన్‌లో రూట్ 178 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. లంచ్ బ్రేక్ సమయానికి ఇంగ్లండ్ 332/2 పరుగులతో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 225పరుగులతో శుక్రవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్‌ను ఓలీ పోప్(71), జో రూట్(63) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. లంచ్ సమయానికి వీరు135 పరుగులు జత చేశారు. రెండో సెషన్‌లో ఈ జోడీని వాషింగ్టన్ సుందర్ విడదీశాడు. పోప్‌ను ఔట్ చేయడంతో వీరి 144పరుగుల భారీ భాగస్వామ్యాన్ని బ్రేక్ పడింది. మూడోరోజు ఆట నిలిచే సమయానికి ఇంగ్లండ్ జట్టు 135 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 544 పరుగులు చేసింది. రూట్(150) ఔట్ కాగా.. స్టోక్స్(77), డాసన్(21) క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ ఇప్పటికే 186పరుగుల ఆధిక్యతను సంపాదించింది. జడేజా, సుందర్‌కు రెండేసి, బుమ్రా, సిరాజ్, కంబోజ్‌కు ఒకో వికెట్ దక్కాయి.

సుందర్‌ను 68ఓవర్ల తర్వాత..!

టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిర్ణయాలపై మాజీ క్రికెటర్లు ధ్వజమెత్తుతున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు 68 ఓవర్ల తర్వాత బౌలింగ్ ఇవ్వడమే ఇందుకు ప్రధాన కారణం. ఇంగ్లండ్ ఓపెనర్లు తొలి వికెట్‌కు 166 పరుగులు, రెండోరోజు తొలి సెషన్‌లో రూట్-పోప్ క్రీజ్‌లో పాతుకుపోయి అర్ధసెంచరీలు పూర్తి చేసుకోవడం, పేసర్లకు పిచ్‌నుంచి సహకారం లభించకున్నా.. కెప్టెన్ గిల్ స్పిన్నర్ సుందర్‌కు బౌలింగ్ ఇవ్వలేదు. మరో స్పిన్నర్ రవీంద్ర జడేజాకు కూడా బౌలింగ్ ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. అయినా గిల్ ఎందుకు సుందర్‌కు ఎందుకు అన్ని ఓవర్లపాటు బౌలింగ్ ఇవ్వలేదో ఎవ్వరికీ అర్థం కాలేదు.

చివరకు 68ఓవర్ల తర్వాత సుందర్‌కు బంతి అందించగా.. క్రీజ్‌లో పాతుకుపోయిన పోప్(71), బ్రూక్(3)లను వెంట వెంటనే ఔట్ చేశాడు. ఇదే విషయమై మాజీ కోచ్ రవిశాస్త్రి, ఇంగ్లండ్ స్టార్ బౌలర్ స్టువర్ట్ టీమిండియా కెప్టెన్ నిర్ణయాన్ని తప్పుబట్టారు.

రూట్ మరో సెంచరీ..

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ మాంచెస్టర్ టెస్టులో సెంచరీతో మెరిసాడు. టెస్టుల్లో రూట్‌కు ఇది 38వ సెంచరీ. దీంతో టెస్టుల్లో అత్యధిక సెంచరీలో కొట్టిన బ్యాటర్ల జాబితాలో 4వ స్థానానికి ఎగబాకాడు. లంచ్ తర్వాత అన్షుల్ కంభోజ్ ఓవర్లో ఫైన్ లెగ్‌లో బౌండరీతో శతకం కొట్టాడు. ఈ క్రమంలో భారత్‌పై శతక వీరుల జాబితాలో రూట్(12సెంచరీలు) టాప్‌లో ఉండగా.. ఆస్ట్రేలియా ఆటగాడు స్టీవ్ స్మిత్ 11 సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. స్వదేశంలో ఇండియాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో మూడు శతకాలతో మెరిసాడు. మాంచెస్టర్ టెస్టులో మూడో రోజు 32 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతడీ ఘనత సాధించాడు. దక్షిణాఫ్రికా వెటరన్ 13,289 పరుగులతో మూడో స్థానంలో ఉండగా.. రూట్ అతడిని అధిగమించాడు.

టెస్టుల్లో అత్యధిక సెంచరీలు కొట్టిన బ్యాటర్లు..	
51	సచిన్ టెండూల్కర్(ఇండియా)
45	జాక్వెస్ కల్లిస్(దక్షిణాఫ్రికా)
41	రికీ పాంటింగ్(ఆస్ట్రేలియా)
38	జో రూట్(ఇంగ్లండ్), కుమార్ సంగక్కర(శ్రీలంక)
36	రాహుల్ ద్రావిడ్(ఇండియా), స్టీవ్ స్మిత్(ఆస్ట్రేలియా)

సెమీస్‌కు సాత్విక్-చిరాగ్

హాంగ్జౌ: చైనా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో మాజీ నంబర్ వన్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్-చిరాగ్ 21-18, 21-14తో ఆంగ్-టియో (మలేషియా)పై విజయం సాధించారు. పివి సింధును ఓడించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన యువ షట్లర్ ఉన్నతి హుడా నిరాశపరిచింది. క్వార్టర్‌ఫైనల్లో ఉన్నతి 16-21, 12-21తో 3వ ర్యాంకర్ యమగుచి (జపాన్) చేతిలో ఓటమిపాలైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68